


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 237, పేజీలు - 08

గురువారం, ఫిబ్రవరి 12, 2026 వెల: 5 రూ./.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# జీహెచ్ఎంసీలో నూతన అధ్యాయం

## మూడు కార్పొరేషన్లుగా హైదరాబాద్ విభజన

- సైబరాబాద్, మల్కాజ్‌గిరి పేర్లతో రెండు కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు
- మూడు సంస్థలకు వేర్వేరుగా కమిషనర్ల నియామకం
- పాలన వికేంద్రీకరణ, పౌర సేవలు మెరుగుపరచడమే లక్ష్యం
- మొత్తం 300 వార్డులు, 60 సర్కిళ్లతో నగర పాలన పునర్వ్యవస్థీకరణ




(గౌటీ బాల సాయి తిలక్ - ప్రశ్న న్యూస్)

గ్రేటర్ హైదరాబాద్ పరిపాలనలో బుధవారం ఒక చారిత్రక మార్పు చోటు చేసుకుంది. ఇప్పటివరకు జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం 3 కార్పొరేషన్లుగా విభజించింది. గతంలో ఉన్న 150 డివిజన్లు పునర్విభజన అనంతరం 243 స్థానాలకు పెరిగాయి. శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల విలీనంతో మరో 57 డివిజన్లు అదనంగా చేరాయి. ఇలా మొత్తం 300 డివిజన్లతో విస్తరించిన మహా నగరాన్ని పరిపాలన సౌలభ్యం కోసం, అధికార వికేంద్రీకరణ లక్ష్యంతో ప్రభుత్వం మూడు కార్పొరేషన్లు జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)లుగా విడగొట్టింది. దీనికి సంబంధించి జిహెచ్ఎంసి చట్టం-1955లోని సెక్షన్-3(1) ప్రకారం అధికారిక గెజిట్ విడుదల కావడంతో బుధవారం నుంచి నూతన కార్పొరేషన్లు విడివిడిగా కార్యకలాపాలు ప్రారంభించాయి. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా హైదరాబాద్ మహానగర పరిధిలోని కీలక మున్సిపల్ కార్పొరేషన్లకు కొత్త కమిషనర్లు నియమితులయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్ బాధ్యతలు స్వీకరించగా, ఐటీ కారిడార్‌తో కూడిన కీలకమైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యతలను జి. సృజన చేపట్టారు. మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా

2లో..

## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

### - కేంద్రంపై రాహుల్ గాంధీ ఫైర్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని, దీని ద్వారా దేశాన్ని, 'భారత మాత'ను అమెరికాకు అమ్మేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్,

2లో..

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

- బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం
- 70 శాతానికిపైగా పోలింగ్, రేపే ఫలితాలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో స్థానిక సంస్థల సమరంలో భాగంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఘట్టం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొనడంతో చాలా మున్సిపాలిటీల్లో భారీగా పోలింగ్ నమోదైంది. చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా సాగిందని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

**- భారీగా నమోదైన పోలింగ్ శాతం**

రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని మొత్తం 2,981 వార్డు డివిజన్లకు ఈ ఎన్నికలు జరిగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. మధ్యాహ్నం 3 గంటల సమయానికే

3లో..

## గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు

- కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపణ



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగం పూర్తిగా డొల్లగా, అవాస్తవాలు, కల్పితాలతో నిండి ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

2లో..

## ఐటీ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల్లో పరుగులు

### - పెట్టుబడులకు గమ్యస్థానంగా రాష్ట్రం

- రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ గాడిన పడిందన్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి బడ్జెట్ సమావేశాల తొలిరోజు ప్రసంగం
- రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.62 లక్షల కోట్లకు చేరిందని వెల్లడి
- తలసరి ఆదాయం రూ.2.95 లక్షలకు పెరిగిందని స్పష్టీకరణ




అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ ఐటీ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల్లో దూసుకెళ్తుందని, పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. విభజన సమస్యలు, గత పాలకులు మిగిల్చిన ఆర్థిక కష్టనష్టాల మధ్య ప్రస్తుత ప్రభుత్వం ప్రయాణం ప్రారంభించిందని పేర్కొన్నారు. మరోవైపు ఏపీ గవర్నర్ ప్రసంగానికి వైసీపీ సభ్యులు అడ్డుతగిలారు. సభ మొదలుకాగానే నిరసనకు దిగిన వైసీపీ సభ్యులు గవర్నర్ ప్రసంగాన్ని బాయ్ కాట్ చేస్తూ అదినేత జగన్ తో కలిసి సభ నుంచి వాకౌట్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు నిర్వీర్యమై, అభివృద్ధి కుంటుపడిందన్నారు. 2024లో రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు కూటమికి అప్పగించారని, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ నేతృత్వంలో పాలన సాగుతోందని చెప్పారు. గత 19 నెలల్లో వ్యవస్థలను గాడిలో పెట్టి, 7 శ్వేత పత్రాల ద్వారా పారదర్శకతను తీసుకువచ్చినట్లు వివరించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా 10 సూత్రాలతో సుపరిపాలన అందిస్తున్నట్లు స్పష్టం చేశారు.

2లో..

## వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడిన హైడ్రా

- ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన అధికారులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములపై కన్నేసిన కబ్జాకోరులపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపుతోంది. నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలైన జూబ్లీహిల్స్, ఖానామెట్‌లలో జరిగిన రెండు వేర్వేరు కబ్జా యత్నాలను భగ్నం చేసింది. ఈ చర్యల ద్వారా సుమారు రూ. 1,003 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడినట్లు అధికారులు తెలిపారు. హైడ్రా ప్రజావాణికి అందిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో అధికారులు బుధవారం ఈ చర్యలు చేపట్టారు.

**- జూబ్లీహిల్స్‌లో పార్కు స్థలం కబ్జా**

జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రి ఔట్ గేట్‌కు ఎదురుగా ఉన్న దాదాపు 2 ఎకరాల పార్కు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. అక్కడ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని లేడీస్ హాస్టల్ నడుపుతున్న సదరు వ్యక్తి, పార్కుకు చెందిన 150 గజాల స్థలంపై కన్నేశాడు. సుమారు 50 గజాల మేర పార్కులోకి చొచ్చుకెళ్లి పాత భవనానికి ఆనుకుని మూడు అంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టాడు. మరో 100 గజాల స్థలాన్ని తన సొంత పార్కుగా మార్చుకుని

2లో..

## 20 నెలల పాలన.. 60 విజయాలు.. ప్రజలకు వివరించండి

### - కూటమి నేతలకు జాబితా ఇచ్చిన సీఎం చంద్రబాబు

- ఎన్డీఏ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం చంద్రబాబు సమావేశం
- 20 నెలల పాలనలో సాధించిన విజయాలను వివరించిన సీఎం
- విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగతి సాధించామన్న చంద్రబాబు

2లో..



## మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కీలక అప్‌డేట్

### - భూసేకరణ ప్రక్రియ ప్రారంభించిన సర్కార్

2లో..



## కాంగ్రెస్ ప్రభంజనం ఖాయం

- ఓటర్లు మావైపే నిలిచారన్న టీపీసీసీ చీఫ్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ సరళిని గమనిస్తే అత్యధిక స్థానాల్లో

2లో..

## ఎగ్జిట్ పోల్స్ లో హస్తం హవా

- 70 నుంచి 85 మున్సిపాలిటీలు గెలుచుకోనున్న అధికార పార్టీ
- బీఆర్ఎస్, బీజేపీలు చాలా వెనుకబడి ఉన్నాయని తేల్చిన సర్వేలు
- రేపు వెలువడనున్న అధికారిక ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ ఎన్నికలు పూర్తి అయ్యాయి. ఎన్నికల ప్రచారం, ప్రలోభాలు, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి నేతలు కూడా హాజరై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దీంతో గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న మున్సిపల్ ప్రచార హోరు, ఎన్నికల హడావుడికి నేటితో తెరపడింది. బుధవారం జరిగిన పోలింగ్‌లో భారీగా పోలింగ్

3లో..

# ఐటీ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల్లో పరుగులు

**- అంతర్జాతీయ పెట్టుబడులు, నాలెడ్జ్ ఎకానమీకి డెస్టినేషన్**

రాష్ట్రం ఐటీ, క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాల్లో దూసుకుపోతోందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తన ప్రసంగంలో వెల్లడించారు. అంతర్జాతీయ సంస్థలు ఏపీని పెట్టుబడులకు, నాలెడ్జి ఎకానమీకి ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటున్నాయని పేర్కొన్నారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటుతో నూతన అధ్యాయం మొదలైందని, ప్రపంచంలోని కొద్ది ప్రాంతాల్లోనే ఉండే ఈ సాంకేతికతను రాష్ట్రంలో స్థాపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. యువతకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పారిశ్రామిక ప్రగతి కోసం రాష్ట్రవ్యాప్తంగా 175 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. స్పేస్ సిటీ, ఏరోస్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్ సిటీ వంటివి రాష్ట్ర అభివృద్ధికి కీలకం కానున్నాయి. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఏటా రూ. 33 వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా వివిధ డీబీటీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎన్టీఆర్ భరోసా ద్వారా 63.12 లక్షల మందికి పెన్షన్లు, తల్లికి వందనం కింద 66 లక్షల మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందుతోంది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే స్త్రీశక్తి, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చే దీపం 2.0 పథకాలు విజయవంతంగా సాగుతున్నాయి. అన్నదాత సుఖీభవ ద్వారా 46.86 లక్షల మంది రైతులకు రూ. 20 వేల చొప్పున లబ్ధి చేకూరుతోంది. నిరుద్యోగ నివారణకు మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. పేదరికం లేని సమాజ స్థాపనే (జీరో పావర్టీ) లక్ష్యంగా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతి కుటుంబానికి ప్రయోజనాలు చేకూరుస్తున్నారు. త్వరలోనే ప్రతి కుటుంబానికి 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' అందించేందుకు కసరత్తు జరుగుతోంది. పీ4 విధానం ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆకలి లేని రాష్ట్రం కోసం 113 నియోజకవర్గాల్లో 205 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేశారు, త్వరలో గ్రామీణ ప్రాంతాలకు వీటిని విస్తరిస్తారు. అందరికీ గృహాలు, ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి సర్కార్ కట్టుబడి ఉంది. బీసీల అభ్యున్నతికి ఎంఎస్ఎంఈ ల ద్వారా ఉపాధి కల్పిస్తూనే, మైనారిటీల భద్రత, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు గవర్నర్ తన ప్రసంగంలో వెల్లడించారు.

### సమగ్ర ఆరోగ్య రక్షణ - సామాజిక భద్రత

గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. 'ప్రజల వైద్య ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'సంజీవని' కార్యక్రమం ద్వారా ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తోంది. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి రూ. 2.5 లక్షల వరకు సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనితో పాటు 1.43 కోట్ల పేద కుటుంబాలకు రూ. 25 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తోంది. క్యాన్సర్ వంటి ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా ఉచిత వైద్యం అందించడం ఈ పథకం ప్రత్యేకత. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీలను బలోపేతం చేస్తూనే, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ద్వారా మహిళలకు న్యాయ సహకారం అందిస్తోంది. అక్రమ మద్యం, గంజాయి నిర్మూలనలో ప్రభుత్వం విశేష పురోగతి సాధించింది.

### మౌలిక సదుపాయాలు - ప్రాంతీయ అభివృద్ధి

రాష్ట్ర సాగునీటి రంగానికి వెన్నెముక వంటి పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నాటికి పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉంది. నదుల అనుసంధానం ద్వారా గోదావరి వరద జలాలను కరువు ప్రాంతాలకు తరలించేలా కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రంలోని 28 జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం విశాఖ, తిరుపతి, అమరావతి కేంద్రాలుగా మూడు రీజియన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అమరావతి పునర్నిర్మాణం వేగంగా సాగుతోందని, దీనికి శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించే ప్రక్రియను కేంద్రం ప్రారంభించిందని గవర్నర్ వివరించారు. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైల్ వ్యవస్థతో పాటు, రాష్ట్రం మీదుగా వెళ్లే మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు రాష్ట్ర ప్రగతికి ఊతమిస్తాయని' తన ప్రసంగంలో పేర్కొన్నారు.

### ఆర్థిక అభివృద్ధిలో మహిళలకు స్థానం

అభివృద్ధి వ్యూహంలో మహిళలను ఆర్థిక భాగస్వాములుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తూ, ఏటా లక్ష మందిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతోందని గవర్నర్ పేర్కొన్నారు. 'వచ్చే ఏడాదిలో ఐదు లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ 'వీబీ జీ రామ్ జీ' పథకం ద్వారా ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచారు. పోర్టు ఆధారిత అభివృద్ధి, ఆక్వా కల్చర్, రాయలసీమలో ఉద్యాన పంటల సాగు వంటి చర్యల ద్వారా ప్రాంతీయ సమానత్వాన్ని సాధించేలా ప్రభుత్వం 25కు పైగా కొత్త పాలసీలను ప్రకటించినట్లు' గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రస్తావించారు.

### గ్రీన్ హైడ్రోజన్ ద్వారా క్లీన్ ఎనర్జీపై ఫోకస్

'గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా సహా పునరుత్పాదక ఇంధనం ద్వారా క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిపై ప్రభుత్వం ఫోకస్ చేసింది. ఏపీని క్లీన్ ఎనర్జీ ఎకనామిక్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. విద్యుత్ వినియోగదారులపై భారం వేయకుండా రూ.4,498 కోట్ల మేర ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. తొలిసారిగా ట్రూ డౌన్ విధానం ద్వారా ప్రజలపై యూనిట్ కు 13 పైసల చొప్పున విద్యుత్ భారాన్ని తగ్గించింది. గతంలో తప్పుడు నిర్ణయాలతో ధ్వంసమైన ఏపీ విద్యుత్ రంగం ఇప్పుడు జాతీయ స్థాయిలో మోడల్‌గా అవతరించింది. తక్కువ ధరతో డేటా సెంటర్లకు విద్యుత్ అందించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సీఐఐ సమ్మిట్ ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు 610 ఎంఓయూలు కుదిరాయి. 16.13 లక్షల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. లి 14 ఎస్ఐపీబీ ల ద్వారా 8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదాన్ని తెలిపి పరిశ్రమలు స్థాపించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా ఇచ్చి ఆ రంగంలో పెట్టుబడులకు ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర బడ్జెట్‌లో అరకు లోయ, పులికాట్ సరస్సుల వద్ద టూరిజం అభివృద్ధి చేస్తోంది. వీటిని ఉపయోగించుకుని ఈ రంగంలో పెద్దఎత్తున ప్రాజెక్టులు సాధించేందుకు కృషి చేస్తోంది. సాగునీటి రంగం అభివృద్ధిలో కీలకంగా మారింది. తక్కువ వర్షపాతం కలిగిన అనంతపురం లాంటి ప్రాంతాలు హార్టీ కల్చర్ హబ్‌గా మారుతున్నాయి. పీఎం ప్రణామ్ పథకం ద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గించి భూసారాన్ని మెరుగుపరిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. పొగాకు, కోకో వంటి పంటలకు మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా రైతులను ప్రభుత్వం ఆదుకుంది. 2030 నాటికి అరకు కాఫీ, కోకో ప్రాసెసింగ్‌లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని' గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

# జీహెచ్ఎంసీలో నూతన అధ్యాయం

టి. వినయ్ కృష్ణారెడ్డి విధుల్లో చేరారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వరకు ఉన్న 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని తెలంగాణ ప్రధాన పట్టణ ప్రాంతం (టీసీయూఆర్) గా ప్రభుత్వం గుర్తించింది. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధించాలనే సంకల్పంతో 2024 సెప్టెంబరులో 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. ఆ తర్వాత 20 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థలను కూడా జిహెచ్ఎంసిలో కలిపారు. ఈ విలీనాల అనంతరం డివిజన్ల పునర్విభజన పూర్తి చేసి నగరాన్ని 300 డివిజన్లుగా, 60 సర్కిళ్లుగా, 12 జోన్లుగా వర్గీకరించారు. ఫిబ్రవరి 10, 2026 నాటికి పాత పాలకమండలి గడువు ముగియడంతో వెంటనే ఈ విభజన ప్రక్రియ అమల్లోకి వచ్చింది. నూతనంగా ఏర్పడిన ఈ 3 కార్పొరేషన్ల ద్వారా స్థానిక సమస్యల పరిష్కారం వేగవంతం కానుంది. పౌర సేవలు ప్రజలకు మరింత చేరువ చేయడమే కాకుండా, మౌలిక సదుపాయాల కల్పనలో స్పష్టత తీసుకురావడానికి ఈ విభజన దోహదపడుతుంది. ఒక్కో కార్పొరేషన్ తన పరిధిలోని నిధులను, వనరులను స్వయంప్రతిపత్తితో వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమబద్ధీకరణ ద్వారా హైదరాబాద్ మహానగరం ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

### 3 కార్పొరేషన్లుగా జిహెచ్ఎంసి.. ఏ ప్రాంతం ఏ పరిధిలోకి

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి)**

పాత జీహెచ్ఎంసీలోని కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్లకు విలీనమైన మణికొండ, నార్సింగి, తెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారం, నిజాంపేట్, దుండిగల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, మేడ్చల్ పట్టణ స్థానిక సంస్థలు కలిశాయి. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) ఏర్పాటు చేశారు. శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలు పూర్తిగా, పటాన్‌చెరు, కూకట్‌పల్లి, మేడ్చల్, రాజేంద్రనగర్ నియోజకవర్గాలు పాక్షికంగా ఉన్నాయి.

**మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి)**

పాత జీహెచ్ఎంసీలోని సికింద్రాబాద్, ఎల్బీనగర్ జోన్లు పాక్షికంగా విలీనమైన బోడుప్పల్, ఫీర్జాదిగూడ, పోచారం, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, తూముకుంట యూఎల్‌బీలతో మల్కాజిగిరి, ఎల్బీనగర్, ఉప్పల్ జోన్లు అయ్యాయి. వాటితో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాలు పూర్తిగా, మేడ్చల్, కూకట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలు పాక్షికంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కిందకు వచ్చాయి.

**జీహెచ్ఎంసీ..**

పాత గ్రేటర్ పరిధిలోని ఖైరతాబాద్, చార్మినార్ జోన్లు సికింద్రాబాద్, ఎల్బీనగర్ జోన్లలోని కొన్ని ప్రాంతాలు, శంషాబాద్, జల్‌పల్లి, బండ్లగూడజాగీర్, బడంగ్‌పేట్, తుక్కుగూడ, ఆదిభట్ల, మీర్‌పేట్, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట యూఎల్‌బీలతో ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్,గోల్కొండ, శంషాబాద్, రాజేంద్రనగర్ జోన్లు అయ్యాయి. వాటితో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, ముషీరాబాద్, మలక్‌పేట్, అంబర్‌పేట, సనత్‌నగర్, నాంపల్లి, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర, బహదూర్‌పుర, సికింద్రాబాద్ నియోజకవర్గాలు పూర్తిగా, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాలు పాక్షికంగా ఉన్నాయి.

భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. విదేశీ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లకు పన్ను రాయితీలు ఇవ్వడంపై రాహుల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఆర్థిక మంత్రి నవ్వుతున్నారు, ఆమెకు నవ్వడం అంటే చాలా ఇష్టం. పెద్ద టెక్ కంపెనీలకు 20 ఏళ్ల పాటు పన్ను మినహాయింపు ఇచ్చారు. మన డేటాతో మీరు చేసిందేమిటి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ వాణిజ్య ఒప్పందం కింద టారిఫ్‌లలో చేసిన మార్పులు ఏకపక్షంగా అమెరికాకు మేలు చేసేలా ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. "మొదట్లో మనపై సగటు టారిఫ్ 3 శాతం ఉండేది, ఇప్పుడు అది 18 శాతానికి పెరిగింది. అంటే ఆరు రెట్లు ఎక్కువ. అమెరికా నుంచి దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి 146 బిలియన్ డాలర్లకు పెరుగుతాయి. కానీ మనకు వాళ్లు ఎలాంటి హామీ ఇవ్వలేదు. మనం మాత్రం వారికి కట్టుబడి ఉండాలి. వాళ్లపై మన టారిఫ్ 16 శాతం నుంచి సున్నాకి తగ్గింది, మనపై మాత్రం వాళ్ల టారిఫ్ 3 నుంచి 18 శాతానికి పెరిగింది" అని ఆయన గణాంకాలతో వివరించారు. ఈ ఒప్పందం వల్ల దేశంలోని టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమవుతుందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. "అమెరికా బంగ్లాదేశ్‌పై సుంకాన్ని సున్నా శాతానికి తగ్గించింది, కానీ భారత్‌పై 18 శాతం విధిస్తోంది. మన టెక్స్‌టైల్ పరిశ్రమదారులు ఏం చేయాలి? వాళ్ల పోటీదారు బంగ్లాదేశ్. వాళ్లు అమెరికా కాటన్‌ను దిగుమతి చేసుకుంటే సున్నా డ్యూటీ. దీంతో మన టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమైపోతుంది" అని అన్నారు. అంతేకాకుండా, ఈ ఒప్పందం దేశ ఇంధన స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుందని రాహుల్ ఆరోపించారు. "ఇకపై మనం ఏ దేశం నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తుంది, మన ప్రధానమంత్రి కాదు. వాళ్లు మనల్ని పర్యవేక్షిస్తారు. అమెరికాకు నచ్చని దేశం నుంచి భారత్ చమురు కొంటే, మనపై టారిఫ్‌లతో శిక్ష విధిస్తారు" అని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాలరాస్తోందని, "పేద రైతులను అణచివేయడానికి తలుపులు తెరిచారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శల తీవ్రతను పెంచుతూ, "మీరు భారతదేశాన్ని అమ్మేశారని నేను చెబుతున్నాను. దేశాన్ని అమ్మడానికి మీకు సిగ్గుగా లేదా? మన తల్లి భారత్ మాతను అమ్మేశారు" అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి ఒత్తిడితోనే ఈ ఒప్పందానికి అంగీకరించారని ఆయన ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు లోక్‌సభలో తీవ్ర దుమారం రేపాయి.

# 20 నెలల పాలన.. 60 విజయాలు..

# ప్రజలకు వివరించండి

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో మరో 15 ఏళ్ల పాటు కూటమి ఐక్యత ఇలాగే కొనసాగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు ఏర్పడలేదని ఇది శుభ పరిణామమని చెప్పిన సీఎం ఇదే ఐక్యత ఇకపైనా కొనసాగాలని, అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇందుకు తగ్గట్టుగా మంచి పనులు చేసి ఎమ్మెల్యేలు పేరు తెచ్చుకోవాలన్నారు. మొన్నటి ఎన్నికల కంటే నేడు కూటమి బలం, ప్రజల మద్దతు మరింత పెరిగిందని ఎన్నికల ముందు ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తితో ముమ్ముందు పని చేయాలన్నారు.మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి ఉండాలన్నారు. అసెంబ్లీ కమిటీ హాలులో ఎన్డీఏ శాసనసభా పక్ష ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గుజరాత్‌లో వరుసగా ఐదుసార్లు బీజేపీ గెలిచి అధికారంలో ఉందని, ఇదే స్ఫూర్తితో ఇక్కడా విజయాలు సొంతం చేసుకోవాలన్నారు. శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడేలా అందరూ మంచి పేరు తెచ్చుకోవాలని సీఎం సూచించారు. ఈ 20 నెలల్లో చాలా కష్టపడి, ఐక్యంగా పని చేశామని సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. వైసీపీ ఐదేళ్ల ఏళ్ల విధ్వంసాన్ని అధిగమించి ప్రగతి వైపు రాష్ట్రాన్ని తీసుకువెళుతున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుందని, ఐక్యంగా ముందుకు వెళతుందని డిప్యూటీ సీఎం చెప్పారు. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో భవిష్యత్‌లో అలాగే పని చేయాల్సి ఉంటుందన్నారు. పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉంటే అంతర్గతంగా కూర్చుని వాటిని పరిష్కరించుకోవాలని పవన్ కళ్యాణ్ చెప్పారు. కూటమి ధర్మాన్నికి ప్రతి ఒక్కరం కట్టుబడి బడి పని చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు.

### అర్థవంతమైన చర్చలు జరగాలి

'జిల్లాల వారీగా ఎమ్మెల్యే, ఎంపీలు, ఎస్పీ, కలెక్టర్లతో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తాం. పొలిటికల్ గవర్నెన్స్‌లో భాగంగా ఎమ్మెల్యేల గౌరవాన్ని పెంచుతాం. నియోజకవర్గాల్లో పెండింగ్ పనులు గుర్తిస్తే ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేద్దాం. మనం చేసే అభివృద్ధి కార్యక్రమాలు ఫలితాలను ఇస్తున్నాయి' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.'మనం ఇంకా పూర్తిగా కోలుకోలేదు, కానీ వ్యవస్థలను గాడిన పెట్టాం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా నియోజకవర్గాల్లో చేసిన పనులను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలి. అసెంబ్లీ సమావేశాలను సభ్యులు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభ్యులు అంతా సభలో ఉండాల్సిందే. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతా సభ్యుల ప్రసంగాలు, మంత్రులు సమాధానాలు వింటాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. మా సమస్యలపై మా ఎమ్మెల్యేలు మాట్లాడారు, మంత్రులు సమాధానం చెప్పారు అని ప్రజలు అనుకోవాలి. విప్‌లు సంతృప్తికరంగా పని చేయాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజల ఆమోదయోగ్యంగా సభ జరగాలి' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### కేంద్ర సాయంతోనే ఇంతటి పురోగతి

'నాడు ఎన్నికల్లో చెప్పిన అన్ని పథకాలు ఇస్తున్నామంటే కేంద్రం ఎంతో సహకారం అందిస్తోంది. అందుకే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టాం. కేంద్రం అమరావతి, పోలవరానికి డబ్బులు ఇవ్వకపోయి ఉంటే నేడు ఈ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యేవి కాదు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకిత చేస్తున్నామంటే కేంద్రం సాయం అందించడమే కారణం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర సాయంతో నిలబెట్టాం'సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.'మన ప్రజల కోసం, మన రాష్ట్రం కోసం, మన విశాఖ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుని సాయం చేసింది. ఇది చిన్న విషయం కాదు. కేంద్ర సాయంతో మొదటిసారిగా ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలను విశాఖ స్టీల్ ప్లాంట్ సాధించింది. ఇదే స్థాయిలో పని చేస్తే అత్యుత్తమ ప్రాజెక్టుగా నిలుస్తుంది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్నాం కేంద్రం సహకారం వల్లనే ఇవన్నీ సాధ్యం అవుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలపై ఎమ్మెల్యేలు ఓనర్ షిప్ తీసుకోవాలి' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### నాడు అధికారంలో వైసీపీ అరాచకాలు

ఎన్డీఏ-ఎల్పీ సమావేశంలో పాల్గొన్న వారిలో 90 శాతం మంది నాటి వైసీపీ ప్రభుత్వ బాధితులేనని సభ్యుల్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నేడు నీతులు చెబుతున్న వైసీపీ నేతలు నాడు అధికారంలో చేసిన అరాచకాలను మరిచిపోయారని విమర్శించారు. వాళ్ల హయాంలో పవన్ కల్యాణ్ విశాఖ వెళితే కనీసం కారు కూడా దిగనివ్వలేదన్నారు. హోటల్ గది నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుపడ్డారని సీఎం చెప్పారు. తన అరెస్టు సమయంలో మద్దతుగా పవన్ కల్యాణ్ హైదరాబాద్ నుంచి వస్తుంటే ఆయనకు అనేక అడ్డంకులు సృష్టించారని సీఎం అన్నారు. విమానంలో వచ్చే అవకాశం లేకుండా చేశారని, రోడ్డు మార్గాన కూడా రానివ్వలేదన్నారు.

ఇలా అనేక సవాళ్లను, ఇబ్బందులను ఎదిరించి కూటమి ఐక్యంగా నిలబడి ఎన్నికల్లో గెలిచిందని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు.

### 20 నెలల పాలనలో ఎన్నో విజయాలు

రాష్ట్రంలో ప్రతీ రంగంలోనూ వృద్ధి నమోదైందని, విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగతి సాధిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. కూటమి ప్రభుత్వం 20 నెలల పాలనలో సాధించిన విజయాలు, చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అతి తక్కువ కాలంలో ప్రజలు మెచ్చే పాలన అందించామని ప్రజావసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా 20 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఈ సమావేశంలో వివరించారు. ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ఈ విజయాలను, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ఓనర్షిప్ తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు

తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోకు కొన్ని మెరుగులు దిద్ది చదివినట్లుగా ఉందని, రాష్ట్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఎలాంటి దశ, దిశ లేదని ఆమె ఎద్దేవా చేశారు. 19 నెలల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి పాలనపై విజన్ గానీ, విజ్ఞత గానీ లేవని, సుపరిపాలన, సమతూకం మచ్చుకైనా కనిపించడం లేదని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని షర్మిల విమర్శించారు. రూ. 33 వేల కోట్లతో వాటిని అమలు చేస్తున్నామని చెప్పడం పూర్తిగా బూటకమని అన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు ఇస్తామన్న నిరుద్యోగ భృతి హామీ అడ్రస్ లేకుండా పోయిందని, తల్లికి వందనం కింద 20 లక్షల మంది విద్యార్థులను, అన్నదాత సుఖీభవ కింద 40 లక్షల మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని, గోడ క్యాలెండర్లు మారుతున్నా జాబ్ క్యాలెండర్ మాత్రం రావడం లేదని విమర్శించారు. కోటి మంది మహిళలకు నెలకు రూ. 1500 ఇచ్చే ఆడబిడ్డ పథకానికి దిక్కులేదని, కానీ 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించి దానిలో జీవం తీశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. సంజీవని లాంటి ఆరోగ్యశ్రీని యూనివర్సల్ హెల్త్ పాలసీ పేరుతో చంపేశారని, 1.43 కోట్ల కుటుంబాలకు వైద్యాన్ని అందని ద్రాక్ష చేశారని మండిపడ్డారు. రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాలు అనేవి అభూత కల్పనలని కొట్టిపారేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత అంటూ డ్రామాలు ఆడుతున్నారే తప్ప చేతల్లో అది కనిపించడం లేదని అన్నారు. కిలో రూపాయికి టమాటో, ఉల్లి అమ్ముకుంటున్న రైతులను పట్టించుకోకుండా, మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా ఆదుకున్నామని చెప్పడం దారుణమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్ వైఖరిపైనా షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు ఓట్లేసి గెలిపించింది ఒక్కరోజు మురిపెం కోసం కాదని, మైకు ఇస్తేనే మాట్లాడతా అని మారం చేయడానికి అసెంబ్లీకి పంపలేదని అన్నారు. జగన్ తన సొంత అజెండాను పక్కనపెట్టి, ప్రజా అజెండాతో సభకు వెళ్లి అధికార పక్షాన్ని నిలదీయాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై, హామీలపై సభావేదికగా పోరాడాలని సూచించారు. శాసనసభకు వెళ్లే దమ్ము, ధైర్యం లేకుంటే జగన్ తన ఎమ్మెల్యేలతో సహా రాజీనామా చేయాలని షర్మిల సవాల్ విసిరారు.

## మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కీలక అప్‌డేట్

**- భూసేకరణ ప్రక్రియ ప్రారంభించిన సర్కార్**

**హైదరాబాద్** మూసీ సుందరీకరణ కోసం కంకణం కట్టుకున్న రేవంత్ రెడ్డి సర్కార్.. ఆ దిశగా కీలక ముందడుగు వేసింది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్‌డేట్‌ను అధికారులు వెల్లడించారు. మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలోనే మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు భూసేకరణ కోసం మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) కీలక ప్రకటన చేసింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వారు ఏవైనా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులో తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఫేజ్ ఏ1 కింద హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు మొత్తం 9.2 కిలోమీటర్ల మేర భూ సేకరణ చేయనున్నారు. ఫేజ్ ఏ2 లో భాగంగా ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు ఉన్న 11.8 కిలోమీటర్ల భూమిని సేకరించనున్నారు.

హైదరాబాద్ జిల్లా గోల్కొండ మండలం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో ఉన్న భూముల సేకరణ కోసం తాజాగా ఎంఆర్‌డీసీఎల్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగానే సుమారు 50 ఎకరాలకు పైగా భూమిని సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.మార్కెట్ విలువ ఆధారంగా భూమిని ఇచ్చే యజమానులకు పరిహారం ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగానే వారి భూమి పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్లకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. ఇక అభ్యంతరాల కోసం గడువు ప్రకటించిన ప్రభుత్వం ఆలోగా ఏదైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే ఆయా భూముల సర్వే నంబర్లు గ్రామాల వారీగా పూర్తి లిస్ట్‌ను విడుదల చేసింది. భూ సేకరణ చట్టం-2013 నిబంధనల ప్రకారం ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను చేపట్టనుంది. మొత్తం 4 జిల్లాల పరిధిలో భూసేకరణ చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసీ డెవలప్‌మెంట్ పనులు చేపట్టనున్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పరిధిలో 14 మండలాల్లోని మొత్తం 46 గ్రామాల్లో పలు దశల వారీగా మూసీ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

# కాంగ్రెస్ ప్రభంజనం ఖాయం



కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో నిలవబోతోందని మహేశ్ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలనకు, సంక్షేమ పథకాలకు పట్టణ ఓటర్లు మద్దతు పలికారని ఆయన వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో పూర్తి సంతృప్తి ఉందని, ఈ ఫలితాలతో అది నిరూపితమవుతుందని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ప్రజల ఆదరణ చూరగొన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం సానుకూల ఫలితాలను ఇస్తుందని చెప్పారు. ఎన్నికల్లో గెలుపు కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడిన హైడ్రా

ఫార్మ్ హౌస్ తరహాలో వాడుకుంటున్నాడు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాయి. కబ్జా నిజమేనని నిర్ధారించుకుని బుధవారం మూడు అంతస్తుల అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. సుమారు రూ.3 కోట్ల విలువైన ఆ పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

### ఖానామెట్‌లో రూ.1000 కోట్ల భూమికి రక్షణ

మరో ఘటనలో, హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని ఖానామెట్‌లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. గతంలో ఈ భూమిని ప్రభుత్వం ఆల్ ఇండియా వెలమ సంఘానికి కేటాయించింది. అయితే, కుల సంఘాలకు భూముల కేటాయింపుపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు స్టే విధించింది. ఇదే అదనుగా కొందరు స్థానికులు వెనుక వైపు నుంచి మట్టి పోస్తూ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కోర్టు తీర్పు వెలువడే వరకు భూమిని కాపాడాలని కోరారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, సుమారు రూ.1000 కోట్ల విలువైన ఈ 5 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ విధంగా ప్రజావాణి ద్వారా అందిన సమాచారంతో హైడ్రా అధికారులు సకాలంలో స్పందించి వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులను కాపాడారు.

# దేశాన్ని ప్రేమించే వారైతే డ్రగ్స్ కు దూరంగా ఉండండి.

**-మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**



మైలవరం (ప్రశ్న న్యూస్ )దేశాన్ని ప్రేమించే వారైతే డ్రగ్స్, మత్తుకు దూరంగా ఉండాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు.మైలవరం పట్టణంలో డ్రగ్స్ పై దండయాత్ర కార్యక్రమంలో విజయవాడ సీపీ ఎస్.వి రాజశేఖరబాబు, , పోలీసు అధికారులతో పాటు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు బుధవారం పాల్గొన్నారు. విద్యార్థులు, ప్రజలు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గళమెత్తారు. ప్రతిజ్ఞ చేశారు. సైకిల్ ను తొక్కి ర్యాలీలో పాల్గొన్నారు.'డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కు బ్రో సిగరెట్టు– రోగానికి మొదటి మెట్టు గుట్కా నరకానికి దగ్గరి దారి గంజాయి– శ్మశానంలో చోటు ఖరారు. డ్రగ్స్– ఆ మూడింటికీ మించి అంటూ నినదించారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ "ప్రతి విద్యార్థి, యువకుడు తన కుటుంబానికి, ఈ దేశానికి ఉపయోగపడాలన్నది కూటమి ప్రభుత్వ ఆకాంక్ష. గంజాయి, డ్రగ్స్ బారిన పడితే ఏదో ఒకరోజు పట్టుబడక తప్పదు. ఎన్‌డీపీఎస్ యాక్టు కింద అరెస్టయితే వారి జీవితంపై పిడుగు పడ్డట్లే కనీసం పదేళ్ల జైలు శిక్ష పడుతుంది. జీవితంలో కీలక సమయం కోల్పోతారు.ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్

**పోలింగ్ కేంద్రాలను సందర్శించిన నిజామాబాద్ లో కలెక్టర్**




నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా కొనసాగింది. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలో అన్ని చోట్ల పోలింగ్ మంగళవారం ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు చేరుకోవడం ప్రారంభించారు. ఉదయం 9.00 గంటల సమయానికి సగటున 8.25 శాతం పోలింగ్ నమోదయ్యింది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 6.49 శాతం, ఆర్మూర్ లో 11.05 శాతం, బోధన్ లో 14.24 శాతం, భీంగల్ లో 9.38 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఉదయం 11 గంటల సమయానికి సగటు పోలింగ్ 22.54 శాతం జరుగగా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 18.94 శాతం, ఆర్మూర్ లో 29.60 శాతం, బోధన్ లో 32.35 శాతం, భీంగల్ లో 31.09 శాతం పోలింగ్ నమోదయ్యింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఓటింగ్ అనూహ్యంగా పుంజుకుంది. సగటున 39.68 శాతం ఓటింగ్ జరుగగా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 35.49 శాతం, ఆర్మూర్ లో 47.93 శాతం, బోధన్ లో 50.69 శాతం, భీంగల్ లో 51.53 శాతం పోలింగ్ నమోదయ్యింది. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి సగటున 48.55 శాతం ఓటింగ్ జరుగగా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 43.18 శాతం, ఆర్మూర్ లో 60.07 శాతం, బోధన్ లో 61.77 శాతం, భీంగల్ లో 63.65 శాతం పోలింగ్ నమోదయ్యింది. జిల్లా ఎన్నికల అధికారి, ఇలా త్రిపాఠి నిజామాబాద్ నగరంలోని ఎస్.ఎఫ్.ఎస్ స్కూల్, అర్సపల్లి పాఠశాల, మాలపల్లిలోని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, ఆర్మూర్ మున్సిపల్ పట్టణంలోని రాం మందిర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్, పెర్కిట్ లోని జిల్లా పరిషత్ బాలుర ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరును, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. హెల్ప్ డెస్క్ లు, మెడికల్ క్యాంపు, వీల్ చైర్ ఇతర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? అని తనిఖీ చేశారు. కలెక్టరేట్ నుండి కూడా ఆయా పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ తీరును, స్థానిక పరిస్థితులను కలెక్టర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అబ్జర్వర్ సీహెచ్.సత్యనారాయణ రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

# శివరాత్రికి ఏర్పాట్లు సిద్ధం చేయండి.

**- కలెక్టర్ తమీమ్ అన్సారియా**



గుంటూరు(ప్రశ్న న్యూస్) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని శివాలయాల్లో భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామి వారిని దర్శించుకునేలా దేవదాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖలను సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తో కలిసి జిల్లాలోని శివాలయాల వద్ద మహాశివరాత్రి పర్వదినం ఏర్పాట్లు పై దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, మున్సిపల్, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో వార్ వన్ సైడ్

**90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కాంగ్రెస్ ఖాతాలో**

**టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ జోశ్యం**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే సుమారు 90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం సాధించబోతోందని ఆయన పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టణ ఓటర్లు పట్టం కట్టారని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శక పరిపాలన, సామాజిక న్యాయానికి కట్టుబడి.. ఇవన్నీ కలిపి కాంగ్రెస్ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచాయని ఆయన అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారనే విషయాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి" అని అన్నారు.ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయని ఆయన వివరించారు.ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థ మెరుగుదలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఓటర్లలో సానుకూల భావనను కలిగించాయని చెప్పారు.ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఉంచిన విశ్వాసం భవిష్యత్‌లో మరింత బాధ్యతగా పని చేయాలని సూచిస్తోందని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. "ప్రజలు ఇచ్చిన ఈ మద్దతు మా బాధ్యతను పెంచింది. ప్రతి మున్సిపాలిటీ, ప్రతి కార్పొరేషన్‌లో పారదర్శకతతో, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు.ప్రతిపక్ష పార్టీలు ప్రచారం చేసిన అసత్యాలు, అవాస్తవాలను ప్రజలు నమ్మలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి నిలబడే ప్రభుత్వమని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు, అభ్యర్థులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ, పట్టణాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ హవాను మరింత బలపరిచాయి. ప్రజా పాలనపై ప్రజల విశ్వాసమే ఈ విజయానికి మూలకారణమని పార్టీ నాయకత్వం అభిప్రాయపడుతోందని ఆయన అన్నారు


# భక్తి శ్రద్ధలతో పెళ్లిరోజు వేడుకలను జరుపుకున్న మగ్గిడి ప్రసాద్ - జయలక్ష్మీ దంపతులు

**- భక్తి - ఆనందోత్సాహాల మధ్య వివాహ వార్షికోత్సవం**



మెట్ పల్లి (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి మండలం, వేంపేట్ గ్రామానికి చెందిన మగ్గిడి ప్రసాద్ – జయలక్ష్మీ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని సంతోషభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం వేములవాడలో శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం వేంపేట్ లోని వారి స్వగృహంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో వేడుకలు జరిపారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుతూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకకు హాజరైన పలువురు అతిథులు మాట్లాడుతూ, ప్రసాద్ – జయలక్ష్మీ దంపతులు ఇలాగే ఐక్యంగా, ఆనందంగా జీవిస్తూ కుటుంబానికి ఆదర్శంగా నిలవాలని కోరుకున్నారు. పరస్పర గౌరవం, అనురాగంతో వారి దాంపత్య జీవితం చిరకాలం కొనసాగాలని, ఇలాంటి పెళ్లిరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించి, ఆశీర్వదించారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో ముక్కంటి ధ్వజారోహణం



శ్రీకాళహస్తి, ( ప్రశ్న న్యూస్ ) మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఘనంగా ముక్కంటి ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. శ్రీ వాయు లింగేశ్వర స్వామి సన్నిధిలోని స్వర్ణ ధ్వజం వద్ద శివపరివారమైన వినాయక స్వామి, శ్రీ వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి, సోమ స్కంద మూర్తి సమేత శ్రీ జ్ఞానాంబిక దేవి, చండికేశ్వర స్వామి ఉత్సవ మూర్తులతో పాటు త్రిశూలం ఉంచి ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. రెండో రోజు మాఘ బహుళ నవమి బుధవారం ముక్కంటి స్వామివారి ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. శివనామస్మరణతో మారుమోగిపోగా ఆలయ పరిసరాలు భారీగా తరలివచ్చిన భక్తులు వాయులింగేశ్వరుడిని ప్రత్యేక పూజలతో దర్శించుకున్నారు వేద పండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా హోమ పూజలు చేశారు. ధ్వజ స్తంభానికి అభిషేకాల నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ..శివనామ స్మరణలతో దేవతామూర్తులను దర్శించుకున్నారు.ఈ ఉత్సవాలను పూర్తి స్థాయిలో ఆగమ శాస్త్ర నియమ నిబంధనలకు అనుగుణంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.భారీ భక్త జనసందోహం వేలాదిమంది భక్తులు ప్రత్యేక పూజలలో పాల్గొని, స్వామివారిని అమ్మవారిని దర్శించుకున్నారు.

# జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

**సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో**

**కలిపి మొత్తం పోలింగ్ 77.70 శాతం నమోదు**

**ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**




సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా పోలింగ్ 77.70 శాతం నమోదు అయిందని తెలిపారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39,942 మంది పురుషులు, 42,011 మంది మహిళా ఓటర్లు, 06 ఇతర ఓటర్లు ఉండగా, 30, 466 పురుషులు, 33,091 మహిళలు, ఇతరులు 05 మొత్తం 63,562 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.55 పోలింగ్ శాతం నమోదు అయింది.అలాగే వేములవాడ మున్సిపల్ పరిధిలో 19,580 మంది పురుషులు, 21,279 మంది మహిళా ఓటర్లు, 18 ఇతర ఓటర్లు ఉండగా, 14,801 పురుషులు, 17,070 మహిళలు, ఇతరులు 10 మంది మొత్తం 31,881 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 77.99 నమోదు అయింది.జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో కలిపి 1,22,836 మంది ఓటర్లు ఉండగా, 95,443 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా మొత్తం పోలింగ్ శాతం 77.70 నమోదు అయింది.సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన కుసుమ రామయ్య ఉన్నత పాఠశాల అలాగే సిరిసిల్ల గీతా నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్ ను, ఓటింగ్ సరళిని సందర్శించి అధికారులతో మాట్లాడారు. అనంతరం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అలాగే 20 వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించారు. వేములవాడ లోని సినారె కళామందిరంలో రిసెప్షన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గాంధీ నగర్ లోని గ్రీన్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్ ,తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్, టీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి




(శ్రీశైలం శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం శ్రీశైలంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.×ఈ సందర్భంగా బస్సుల ఫ్రీక్వెన్సీ, రాకపోకల సమయాలు, వివిధ ప్రాంతాలకు బయలుదేరే బస్సుల షెడ్యూల్ తదితర అంశాలపై ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో బస్సులు సమయపాలన పాటిస్తున్నాయా లేదా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగుతున్నాయా అన్న విషయాలను ప్రయాణికులతో నేరుగా ముఖాముఖి మాట్లాడి తెలుసుకున్నారు. భక్తులకు స్పష్టమైన సమాచారం అందించేందుకు బస్టాండ్‌లో సమర్థవంతమైన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, ఏ బస్సు ఏ ప్లాట్‌ఫారమ్ వద్దకు వస్తుందో, ఏ సమయానికి బయలుదేరుతుందో నిరంతరం ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రద్దీ సమయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు.×అలాగే ప్రయాణికులకు కూర్చునే సదుపాయాలు తగినంతగా ఉన్నాయా లేదా, పారిశుధ్య పరిస్థితి ఎలా ఉందో, టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా జరుగుతోందా లేదా అన్న విషయాలను పరిశీలించారు. బస్టాండ్‌లో ఫ్యాన్లు సక్రమంగా పనిచేయాలనీ, త్రాగునీటి సదుపాయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా, అవసరమైతే అదనపు బస్సులు నడపాలని, రాత్రి వేళల్లో కూడా సేవలను బలోపేతం చేయాలని ఆర్టీసీ అధికారులకు కలెక్టర్ సూచించారు.

# భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే**

**రాజన్న సిరిసిల్ల** మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను బుధవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి ఐపీఎస్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, భక్తుల ఎంట్రీ ఎగ్జిట్ మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు తదితర అంశాలను వారు పరిశీలించి, జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు.వీఐపీ దర్శనాల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.పరిశీలనలో ఆలయ ఈవో ఎల్. రమాదేవి, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, ఈఈ రాజేష్, ఆర్అండ్బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, టీపీఓ అన్సార్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

## ప్రతి పదంలో ప్రజల భవిత పట్ల ఆరాటం

**పునరుజ్జీవనం నుంచి శిఖరాగ్ర దిశగా రాష్ట్ర పయనానికి సమగ్ర దర్శని**

**గవర్నర్ ప్రసంగంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్ర విభజనతో మొదలైన బాలారిష్టాలతో పాటు గత ప్రభుత్వ విధ్వంసక పాలనతో ఎదురైన పెను సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న సమగ్ర యాగానికి బుధవారం నాటి గవర్నర్ ప్రసంగం అద్దంపట్టిందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఉభయ సభల సభ్యులనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగంలో ప్రతి పదంలో రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిత పట్ల కూటమి ప్రభుత్వం యొక్క నిరంతర ఆరాటం, శ్రమ ప్రతిబింబించాయని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పునరుజ్జీవనం నుంచి ఉన్నత శిఖరాల అధిరోహణ' అన్న ప్రధాన ఇతివృత్తంతో దార్శనికుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు అలుపెరుగని శ్రమతో సవాళ్లను అవకాశాలుగా తీసుకుని రాష్ట్రం ముందుకుపోతున్న వైనాన్ని గవర్నర్ కళ్లకు కట్టేలా వివరించారని మంత్రి అన్నారు. ఇందులో భాగంగా 2019-24 కాలంలో అప్పటి ప్రభుత్వం సృష్టించిన విధ్వంసాన్ని, దాని పరిణామాలను గవర్నర్ వివరించడం ఎంతో సందర్భోచితంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. అప్పటి విధ్వంసం నుంచి తేరుకుంటూ 'క్వాంటం కంప్యూటింగ్' దిశగా అడుగులేస్తున్న రాష్ట్రం ఉన్నత శిఖరాల్ని అధిరోహించి స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నడిపిస్తున్న తీరును అందరికీ అర్థమయ్యేలా గవర్నర్ ఆవిష్కరించారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.


## శ్రీశైలంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి



శ్రీశైలం (ప్రశ్న న్యూస్ )మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలానికి నడకదారిన భారీగా తరలివస్తున్న భక్తులకు అందిస్తున్న వైద్య సేవలపై నంద్యాల కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం శ్రీశైలంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నడకదారిన పాదయాత్ర ద్వారా చేరుకున్న భక్తులకు అందిస్తున్న వైద్య చికిత్సలు, అత్యవసర సేవలు, ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) సదుపాయాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అస్వస్థతకు గురైన భక్తుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కల్పించిన పడకల సదుపాయం, తాగునీటి ఏర్పాటు, విశ్రాంతి గదులు, శుభ్రత నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఔషధాల లభ్యత, అత్యవసర మందుల నిల్వలు, అవసరమైన వైద్య పరికరాల అందుబాటు పరిస్థితిపై వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు.వైద్య సిబ్బంది హాజరు, డ్యూటీ చార్ట్, రోగుల నమోదు విధానం తదితర పరిపాలనా అంశాలను కూడా కలెక్టర్ సమీక్షించారు. భక్తులకు సమయానుకూలంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. సేవలలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని వైద్యాధికారులకు ఆదేశించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రతి భక్తుడికి అవసరమైన వైద్య సహాయం తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పాదయాత్ర ద్వారా వచ్చే భక్తుల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు.

## అనుమతి పొందిన ప్లాన్ మేరకే నిర్మాణాలు జరగాలి

**కమిషనర్ మయూర్ అశోక్**




గుంటూరు (ప్రశ్న న్యూస్ )నగరంలో జిఎంసి నుండి అనుమతి పొందిన ప్లాన్ మేరకే నిర్మాణాలు జరగాలని, లేకుంటే చట్టపరమమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. బుధవారం ఇన్నర్ రింగ్ రోడ్, అమరావతి రోడ్, ప్రశాంతి నగర్, నెహ్రూ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, ఇన్నర్ రింగ్ రోడ్ లో ప్లాన్ కి అనుగుణంగా భవనం నిర్మాణం లేకపోవడంపై సంబందిత టిపిబిఓ రామకృష్ణకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ సచివాలయాల వారీగా నూతన నిర్మాణాలు జరిగే సమయంలోనే ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు నిర్దేశిత ప్లాన్ మేరకు జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. బహుళ అంతస్తు భవనాలు సెట్ బ్యాక్స్, ర్యాంప్ లు, గ్రీనరీకి కేటాయింపు, డ్రైనేజి కనెక్షన్ వంటి నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ప్లానింగ్ కార్యదర్శులు ఎల్ఆర్ఎస్, బిపిఎస్ ల దరఖాస్తులను త్వరగా క్లియర్ చేయాలన్నారు. నెహ్రూ నగర్ రైల్వే గేటు దగ్గర డ్రైన్ నిర్మాణ పనుల కోసం మార్కింగ్ జరిగిన ప్రాంతాల్లో ప్రభావితమయ్యే వారిలో అర్హులకు ప్రభుత్వ లే అవుట్లలో స్థలాలు కేటాయించాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. 3 వంతెనల దగ్గర డ్రైన్ ని పరిశీలించి, వర్షం నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోనున్నామన్నారు. వసంతరాయపురం రోడ్ విస్తరణ గూర్చి అడిగి, పూర్తి నివేదిక ఇవ్వాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. ప్రజారోగ్య కార్యదర్శులు, అధికారులతో మాట్లాడుతూ ప్రజలు ఇంటి వద్దనే నూరు శాతం వ్యర్థాలను తడిపొడిగా వేరు చేసి ఇచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. క్లస్టర్, హోమ్ కంపోస్ట్ తయారీని ప్రోత్సహించాలన్నారు. పన్ను వసూళ్లపై మాట్లాడుతూ సచివాలయం పరిధిలో నూరు శాతం పన్ను వసూళ్లు కావాల్సిందేనన్నారు. అడ్మిన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ప్రత్యేక దృష్టితో పన్ను వసూళ్లు చేయాలన్నారు. పర్యటనలో సిపి రాంబాబు, డిసిపి సూరజ్, ఏసిపి రెహ్మాన్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మెడికల్ మాఫియాను
# అరికట్టాలి ప్రజారోగ్యాన్ని కాపాడాలి

**-ఫిబ్రవరి 14 రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ ఆందోళనలు జయప్రదం చేయండి**

**- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం గోడ పత్రిక ఆవిష్కరణ చేసిన సిపిఐ నాయకులు.**




విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్ కె రహిమాన్ లు మాట్లాడుతూ ప్రస్తుత సమాజ ప్రాధాన్య అవసరాల విషయంలో విద్య, వైద్యం ప్రధానమైనవని, ప్రాథమికంగా ప్రజారోగ్యం అనేది ప్రభుత్వ బాధ్యతగా రాజ్యాంగం నిర్వచించినప్పటికీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నూతన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తామంటూ ఒంటెద్దు పోకడకు పోతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో వైద్య ఆరోగ్య శాఖ కనీసం 10 మందికి పైగా శాఖాధిపతులను కలిగి, అతిపెద్ద శాఖగా వుందని, కాని ఏ విభాగం కూడా ప్రజారోగ్యంపట్ల శ్రద్ధ చూపకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని, మందుల సరఫరాలో నిర్లక్ష్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ రంగంలో హాస్పిటల్స్, నర్సింగ్, పారామెడికల్, ఫార్మా విభాగాల్లో మాఫియా వేళ్లూనుకుపోయిందన్నారు. డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఫార్మసిస్టుల శాశ్వత నియామకాలను మూడు దశాబ్దాలుగా చేపట్టకుండా కాంట్రాక్ట్ సిబ్బందితో దశాబ్దాలుగా కాలం గడిపేస్తున్నారన్నారు. ఇబ్బడిముబ్బడిగా వున్న వైద్య, నర్సింగ్, ఫార్మసీ కళాశాలలలో నాసిరకం వైద్య ప్రమాణాలు, కౌన్సిళ్లలో అవినీతి భాగోతం వెలుగుచూస్తోందని, ముఖ్యంగా ఫార్మసీ కౌన్సిల్లో డ్రగ్స్ ట్రేడ్ మాఫియా, ఔషధ నియంత్రణ శాఖల ఉమ్మడిగా కుమ్మక్కవడం, అప్రజాస్వామిక విధానాలలో కౌన్సిల్ ఎన్నికలలో అనేక అక్రమాలు చేయడం జరిగిందన్నారు. మెడికల్ మాఫియా విషయంలో ప్రాథమికంగా వృత్తి వైద్య విద్య మరియు అనుబంధ కోర్సుల నుండే దోపిడి మొదలు అవుతున్నదని, విద్య సంబంధిత కౌన్సిళ్లలో రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియలకు సంబంధించి జరుగుతున్న అవినీతి పర్వంతో నకిలీ మందులు, నాసిరకం మందులు, వీటి ధరవరల విషయంలో ఫార్మా కంపెనీలు చేసే ఆగడాలు దుర్మార్గంమని తెలిపారు. ప్రజా ఆరోగ్య విభాగాలు, ఔషధ నియంత్రణ శాఖలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని అన్నారు. చిన్న ఆర్ఎంపి మొదలు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వరకు, గల్లీ మందుల దుకాణం మొదలు ఫార్మసీల వరకు, చిన్న ల్యాబ్ మొదలు పెద్ద డయాగ్నోస్టిక్ సెంటర్లలో కమీషన్ల కోసం చేసే దందాలు అన్నీ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పేదవాళ్ల నడ్డి విరిచేస్తున్నాయని తెలిపారు. నామమాత్ర ఆరోగ్య శ్రీ, ఎన్టీఆర్ వైద్య సేవల నిర్వహణతో రోగులు తప్పనిసరిగా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుండడంతో మెడికల్ మాఫియా చెలరేగిపోతోందన్నారు. సంబంధిత వృత్తిదారుల విద్యా ప్రమాణాల మొదలు వారి నియామకాలు, పరిరక్షణ, ప్రభుత్వం నిర్దేశించిన స్టయిఫండ్ ఎగగొట్టడం (మెడికల్ కాలేజీలలో దీని విలువ రూ.300 నుంచి రూ.500 కోట్లు) ఇలా ఎన్నో అంశాలలో అక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో పేట్రేగిపోతున్న మెడికల్ మాఫియా నేరుగా ఫార్మసీ కౌన్సిల్ ను ఆక్రమించిన విధానం తీవ్ర ఆక్షేపణీయమని, సంబంధిత ఫార్మసిస్ట్ సంఘాలు తెలిపిన పలు విషాయాలతో మెడికల్ మాఫియాలో ఎన్నో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఐ ఇప్పటికే ప్రభుత్వ అధికారులను కోరటం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్-ప్రైవేట్-పార్టనర్షిప్ (పిపిపి) పేరుతో మెడికల్ కాలేజీలను, అనుబంధ ఆసుపత్రులను ప్రైవేటు శక్తులకు అప్పగించడంతో పేద, సామాన్య మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సంరక్షణ, పేద విద్యార్థులకు వైద్య విద్య ప్రశ్నార్థకంగా మారిందని, మెడికల్ మాఫియా అక్రమాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని వారు తెలిపారు. ఈ పరిస్థితుల్లో పలు కార్పొరేట్ ఆసుపత్రులలో శిక్షణ పొందిన నర్సులు, ఫార్మసిస్టుల స్థానంలో ఏమాత్రం అర్హతలేని వ్యక్తులతో పనిచేయిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ మాఫియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మెడికల్ మాఫియాపై ప్రజల్లో చైతన్యం కలిగించి మహత్తర ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి మందుల ధరల్లో వ్యత్యాసాలు, ఫార్మా కంపెనీల ఆగడాలు, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడికి అడ్డుకట్టవేయాలని, మెడికల్ మాఫియా ఆగడాలు అరికట్టి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని, ఆరోగ్యశ్రీని తగు నిధులు విడుదల చేసి సక్రమంగా అమలు జరిగేలా చూడాలని, మెడికల్ కాలేజీల పిపిపి విధానానికి స్వస్తిపలికి ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14వ తేదీన రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లాలలో ఆందోళనలు చేపట్టడం జరుగుతుందని, ఈ ఆందోళనా కార్యక్రమాల్లో యావన్మంది ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయవలసిందిగా సిపిఐ తరుపున కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె సత్యాంజనేయ, ఆర్ శ్రీనివాసరావు, ఎన్ నాగభూషణం,కె వనజాక్షి,సి ఎన్ క్షేత్రపాల్, జి కాసులరెడ్డి,వై రాంబాబు, ఎ దేముడమ్మ, పి ఎస్ పద్మ, బి పుష్పలత, సీహెచ్ కాసుబాబు తదితరులు పాల్గొన్నారు

## ఐక్యంగా, బలంగా మరో 15 ఏళ్లు
# కూటమి కొనసాగాలి

- గుజరాత్ తరహాలో ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి...ఏపీలోను అదే జరగాలి
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ఎన్నికల నాటి కంటే ప్రజా మద్దతు పెరిగింది
- ప్రభుత్వ విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి... ఎమ్మెల్యేలు, మంత్రులు ఓనర్షిప్ తీసుకోవాలి
- కేంద్ర సాయం లేకపోతే ఇన్ని కార్యక్రమాలు సాధ్యం కాదు
- ఎన్నికల సమయంలో ఏ స్ఫూర్తితో పని చేశామో... అదే స్ఫూర్తి ఎప్పటికీ కొనసాగాలి
- సభను పకడ్బందీగా నడుపుదాం అర్థవంతమైన చర్చలు నిర్వహిద్దాం
- ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు
- ప్రతి ఒక్కరూ కూటమి ధర్మానికి కట్టుబడి ఉండాలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- గత 20 నెలల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నేతలకు వివరించిన ముఖ్యమంత్రి

అమరావతి (ప్రశ్న న్యూస్ )రాష్ట్రంలో మరో 15 ఏళ్ల పాటు కూటమి ఐక్యత ఇలాగే కొనసాగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు ఏర్పడలేదని, ఇది శుభ పరిణామమని చెప్పిన సీఎం ఇదే ఐక్యత ఇకపైనా కొనసాగాలని, అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇందుకు తగ్గట్టుగా మంచి పనులు చేసి ఎమ్మెల్యేలు పేరు తెచ్చుకోవాలన్నారు. మొన్నటి ఎన్నికల కంటే నేడు కూటమి బలం, ప్రజల మద్దతు మరింత పెరిగిందని ఎన్నికల ముందు ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తితో మున్ముందు పని చేయాలన్నారు. మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి ఉండాలన్నారు. అసెంబ్లీ కమిటీ హాలులో ఎన్డీఏ శాసనసభా పక్ష ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గుజరాత్‌లో వరుసగా ఐదుసార్లు బీజేపీ గెలిచి అధికారంలో ఉందని, ఇదే స్ఫూర్తితో ఇక్కడా విజయాలు సొంతం చేసుకోవాలన్నారు. శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడేలా అందరూ మంచి పేరు తెచ్చుకోవాలని సీఎం సూచించారు. ఈ 20 నెలల్లో చాలా కష్టపడి, ఐక్యంగా పని చేశామని సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వైసీపీ ఐదేళ్ల ఏళ్ల విధ్వంసాన్ని అధిగమించి ప్రగతి వైపు రాష్ట్రాన్ని తీసుకువెళుతున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుందని, ఐక్యంగా ముందుకు వెళతుందని డిప్యూటీ సీఎం చెప్పారు. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో... భవిష్యత్‌లో అలాగే పని చేయాల్సి ఉంటుందన్నారు. పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉంటే అంతర్గతంగా కూర్చుని వాటిని పరిష్కరించుకోవాలని పవన్ కళ్యాణ్ చెప్పారు. కూటమి ధర్మాన్నికి ప్రతి ఒక్కరం కట్టుబడి బడి పని చేయాలని సూచించారు.

### అర్థవంతమైన చర్చలు జరగాలి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'జిల్లాల వారీగా ఎమ్మెల్యే, ఎంపీలు, ఎస్పీ, కలెక్టర్లతో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తాం. పొలిటికల్ గవర్నెన్స్‌లో భాగంగా ఎమ్మెల్యేల గౌరవాన్ని పెంచుతాం. నియోజకవర్గాల్లో పెండింగ్ పనులు గుర్తిస్తే ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేద్దాం. మనం చేసే అభివృద్ధి కార్యక్రమాలు ఫలితాలను ఇస్తున్నాయి. మనం ఇంకా పూర్తిగా కోలుకోలేదు. కానీ వ్యవస్థలను గాడిన పెట్టాం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా నియోజకవర్గాల్లో చేసిన పనులను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలి. అసెంబ్లీ సమావేశాలను సభ్యులు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభ్యులు అంతా సభలో ఉండాల్సిందే. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతా సభ్యుల ప్రసంగాలు, మంత్రులు సమాధానాలు వింటాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. మా సమస్యలపై మా ఎమ్మెల్యేలు మాట్లాడారు, మంత్రులు సమాధానం చెప్పారు అని ప్రజలు అనుకోవాలి. విప్‌లు సంతృప్తికరంగా పని చేయాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజల ఆమోదయోగ్యంగా సభ జరగాలి.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

### కేంద్ర సాయంతోనే ఇంతటి పురోగతి

'నాడు ఎన్నికల్లో చెప్పిన అన్ని పథకాలు ఇస్తున్నామంటే కేంద్రం ఎంతో సహకారం అందిస్తోంది. అందుకే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టాం. కేంద్రం అమరావతి, పోలవరానికి డబ్బులు ఇవ్వకపోయి ఉంటే నేడు ఈ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యేవి కాదు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకిత చేస్తున్నామంటే కేంద్రం సాయం అందించడమే కారణం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర సాయంతో నిలబెట్టాం. మన ప్రజల కోసం, మన రాష్ట్రం కోసం, మన విశాఖ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుని సాయం చేసింది. ఇది చిన్న విషయం కాదు. కేంద్ర సాయంతో మొదటిసారిగా ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలను విశాఖ స్టీల్ ప్లాంట్ సాధించింది. ఇదే స్థాయిలో పని చేస్తే అత్యుత్తమ ప్రాజెక్టుగా నిలుస్తుంది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్నాం... కేంద్రం సహకారం వల్లనే ఇవన్నీ సాధ్యం అవుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలపై ఎమ్మెల్యేలు ఓనర్ షిప్ తీసుకోవాలి' అని సీఎం చంద్రబాబు అన్నారు.

### నాడు అధికారంలో వైసీపీ అరాచకాలు

ఎన్డీఏ-ఎల్పీ సమావేశంలో పాల్గొన్న వారిలో 90 శాతం మంది నాటి వైసీపీ ప్రభుత్వ బాధితులేనని సభ్యుల్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి అన్నారు. నేడు నీతులు చెబుతున్న వైసీపీ నేతలు నాడు అధికారంలో చేసిన అరాచకాలను మరిచిపోయారని విమర్శించారు. వాళ్ల హయాంలో పవన్ కల్యాణ్ విశాఖ వెళితే కనీసం కారు కూడా దిగనివ్వలేదన్నారు. హోటల్ గది నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుపడ్డారని సీఎం చెప్పారు. తన అరెస్టు సమయంలో మద్దతుగా పవన్ కల్యాణ్ హైదరాబాద్ నుంచి వస్తుంటే ఆయనకు అనేక అడ్డంకులు సృష్టించారని సీఎం అన్నారు. విమానంలో వచ్చే అవకాశం లేకుండా చేశారని, రోడ్డు మార్గాన కూడా రానివ్వలేదన్నారు. ఇలా అనేక సవాళ్లను, ఇబ్బందులను ఎదిరించి కూటమి ఐక్యంగా నిలబడి ఎన్నికల్లో గెలిచిందని సీఎం వివరించారు.



### 20 నెలల పాలనలో ఎన్నో విజయాలు

రాష్ట్రంలో ప్రతీ రంగంలోనూ వృద్ధి నమోదైందని, విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగతి సాధిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం 20 నెలల పాలనలో సాధించిన విజయాలు, చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అతి తక్కువ కాలంలో ప్రజలు మెచ్చే పాలన అందించామని... ప్రజావసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా 20 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఈ సమావేశంలో వివరించారు. ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ఈ విజయాలను, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ఓనర్షిప్ తీసుకోవాలని అన్నారు. 20 నెలల్లో ప్రభుత్వం అమలు చేసిన ప్రధాన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి.

# నాన్న ప్రేమను గుర్తుచేసే నవాబ్ కేఫ్



శివ కందుకూరి, రాజీవ్ కనకాల, తేజు అశ్విని ప్రధాన పాత్రధారులుగా రూపొందిన వినోదాత్మక చిత్రం 'నవాబ్ కేఫ్'. ప్రమోద్ హర్ష దర్శకుడు. రాధా వి.పపుడిప్పు నిర్మాత. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. "చాయ్ వాలా' అనే టైటిల్‌తో ఈ సినిమా ప్రయాణం మొదలుపెట్టాం. సెన్సార్‌వారు ఈ టైటిల్ విషయంలో అభ్యంతరం తెలియజేయడంతో 'నవాబ్ కేఫ్' అని మార్చాం. నిజానికి 'నవాబ్ కేఫ్' అనే పేరుతోనే దర్శకుడు ప్రమోద్ ఈ కథ రాశారు. చివరికి ఈ సినిమా పేరు అదే అయ్యింది. అదే డెస్టినీ. నిజాయితీగా ఈ సినిమా చేశాం. అందరికీ కనెక్టయ్యే కథ ఇది. సినిమా చూసి బయటకొచ్చిన ప్రతి ఒక్కరూ తమ తండ్రులకు ఫోన్ చేసి మాట్లాడతారు. అంత ఎమోషనల్‌గా సినిమా ఉంటుంది.' అని హీరో శివ కందుకూరి తెలిపారు. తాను చూసిన, అనుభవించిన సంఘటనల ఆధారంగా ఈ కథ రాశానని దర్శకుడు ప్రమోద్ హర్ష చెప్పారు. ఇంకా కథానాయిక తేజు అశ్విని, సహనిర్మాత వెంకట్ ఆర్.పపుడిప్పు కూడా మాట్లాడారు.



# నా కూతురికి ఈ సినిమాను గిఫ్ట్‌లా ఇవ్వాలనుకున్నా.. 'సీతా పయనం'పై అర్జున్

యాక్షన్ కింగ్ అర్జున్ డైరెక్షన్‌లో వస్తున్న తాజా చిత్రం సీతా పయనం (ాావవ్ష్ఖు ్ఘఖుఝఖుఎ). అర్జున్ కూతురు ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ యాక్టర్ నిరంజన్ సుధీంద్ర హీరోగా నటిస్తున్నాడు.

ఈ మూవీని వాలైంటెన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈవెంట్‌లో అర్జున్ మాట్లాడుతూ.. సీతా పయనం అనేది ఒక్కరి ప్రయాణం కాదని అన్నాడు. నా కూతురును ఒక మంచి కథతో పాజిటివిటీ ఉన్న సినిమాతో పరిచయం చేయాలని అనుకున్నా. నా కూతురికి ఈ సినిమాను ఒక గిఫ్ట్‌లా ఇవ్వాలనుకున్నా. జనాలకు ఓ మంచి సినిమాను ఇవ్వాలనే బాధ్యతతో ఈ మూవీని ఎంతో నిజాయితీతో తీశాను. ఉపేంద్ర అన్న కొడుకు నిరంజన్ చాలా టాలెంటెడ్ పర్సన్. అతడు అభి పాత్రలో అద్భుతంగా నటించాడు.

నా కూతురి గురించి నేను కాకుండా ప్రేక్షకులు చెప్పాలి. ఈ సినిమాలో తండ్రీ, కూతుళ్ల ట్రాక్.. ఈ క్రమంలో వచ్చే సీన్లు గొప్పగా ఉంటాయి. ప్రకాశ్ రాజ్ పాత్రను అందరూ లైక్ చేస్తారని చెప్పుకొచ్చాడు అర్జున్. అన్ని రకాల కమర్షియల్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కించిన బంధాల విలువలను చాటి చెప్పే చిత్రమిదని అన్నాడు. చీఫ్ గెస్ట్‌గా హాజరైన బ్రహ్మానందం మాట్లాడుతూ.. రియల్ జెంటిల్‌మెన్ అర్జున్ గురించి తాను ఈ ఈవెంట్‌కు వచ్చానన్నాడు . అర్జున్ డైరెక్ట్ చేసిన జై హింద్ 2 చిత్రంలో నేను నటించాను. అర్జున్ ఎప్పుడూ ఎవరినీ డిమాండ్ చేయరు. ఈ చిత్రంతో ఐశ్వర్యకు మంచి పేరు రావాలని.. ఎప్పుడూ సౌమ్యుడిగా ఉండే అర్జున్ పేరును నిలబెట్టాలని కోరుకుంటున్నట్టు చెప్పాడు.

తనకు కేవలం ఓ సినిమా మాత్రమే కాదని.. ఇది తనకొక ఎమోషన్ అని చెప్పింది ఐశ్వర్య . ప్రేమ, కుటుంబం, విలువల గురించి చెప్పే సినిమా సీతా పయనం అని చెప్పుకొచ్చింది. అర్జున్ హోం ప్రొడక్షన్ బ్యానర్ శ్రీరామ్ ఫిల్మ్ ఇంటర్నేషనల్‌పై నిర్మిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన సాంగ్స్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీలో అర్జున్, కన్నడ యాక్టర్ ధ్రువ్ సార్జా కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిరంజన్, ప్రకాశ్ రాజ్, కోవై సరళ, సత్యరాజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# హింసాత్మక చీకటి ప్రపంచం



దర్శక, నటుడు రవిబాబు స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'రేజర్'. ఇదొక ఉత్కంఠతో కూడిన హింసాత్మక చీకటి ప్రపంచమని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. ఈ సందర్భంగా పోస్టర్‌తోపాటు ఓ గ్లింప్స్‌ని కూడా మేకర్స్ మంగళవారం విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రవిబాబు వైలెంట్ అవతారంలో కనిపించారు.కారు ఇంజిన్ వాల్వ్ కవర్‌తో విలన్‌ను హతమార్చే సన్నివేశం ఈ సినిమా కల్చర్‌ని తెలియజేస్తున్నది. తెలుగు తెరపై ఇప్పటివరకూ చూడని విభిన్నమైన కథతో ఈ సినిమా రూపొందుతున్నదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: చరణ్ మాధవనేని, సంగీతం: ఎస్.ఎస్.రాజేష్, సమర్పణ: సురేష్ ప్రొడక్షన్స్ డి.సురేశ్‌బాబు, నిర్మాణం: ఫ్లయింగ్ ఫ్రాగ్స్.

# కపుల్ ఫ్రెండ్లీ ఓ జంట ప్రయాణం



సంతోష్ శోభన్ హీరోగా నటించిన రొమాంటిక్ లవ్‌స్టోరీ 'కపుల్ ఫ్రెండ్లీ'. మానస వారణాసి కథానాయిక. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందింది. నిర్మాత ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. చిత్ర పంపిణీదారుడు ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'సెన్సార్‌వారు చెప్పినట్టు టైటిల్ మార్చకపోవడంతో ఈ సినిమాకు ఏ సర్టిఫికెట్ ఇచ్చారు. నిజానికి ఇది ప్యూర్ లవ్‌స్టోరీ. ఇంకా చెప్పాలంటే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. అన్ని వర్గాలూ ఇబ్బంది లేకుండా ఈ సినిమా చూడొచ్చు. ఈ సినిమా సంతోష్‌శోభన్‌కి మంచి బ్రేక్ అవుతుంది. అలాగే కథానాయిక మానస వారణాసి తన పాత్రకు జీవం పోసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్యపట్టణాల్లో ఈ నెల 13న సాయంత్రం నుంచే ప్రీమియర్లు మొదలవుతాయి' అని తెలిపారు. మిత్ర పరిచయం శివ జీవితాన్ని ఎలా మార్చింది? మిత్ర ప్రేమకోసం శివ ఎంతదాకా వెళ్లాడు? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా అనీ, ఇది ఓ జంట ప్రయాణమనీ, అంచనాలకు తగ్గట్టు విజయం కూడా ఈ సినిమాకు దక్కాలని సంతోష్ శోభన్ ఆశాభావం వెలిబుచ్చారు. టీమ్ వర్క్ అంటే ఏంటో ఈ సినిమా షూటింగ్‌లో చూశానని కథానాయిక మానస వారణాసి చెప్పారు.

# చెక్ బౌన్స్ కేసులో జైలుకు రాజ్‌పాల్ యాదవ్..

## - సల్మాన్, అజయ్ సహా సాయమందిస్తున్న బాలీవుడ్



రూ.9 కోట్ల చెక్ బౌన్స్ కేసులో నటుడు రాజ్‌పాల్ యాదవ్ తిహార్ జైలులో లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ నెల 5వ తేదీ నుంచి అతడు జైలులోనే ఉన్నాడు. తన దగ్గర డబ్బులు లేవని, వాటిని తిరిగి చెల్లించే స్థితి లేదని అతడు అంతకుముందు మీడియాకు తెలిపాడు. తనను ఆదుకునే స్నేహితులు కూడా లేరని చెప్పాడు. ఇక.. తప్పనసరిగా జైలుకు వెళ్లాల్సిందే అని, ఈ పరిస్థితిని తనొక్కడే ఎదుర్కోవాలని చెప్పాడు. అయితే, ఈ మాటలు బాలీవుడ్‌ను కదిలించాయి. దీంతో చాలా మంది వరుసగా అతడికి సాయం చేసేందుకు ముందుకొస్తున్నారు. మొదటగా నటుడు సోనూ సూద్ స్పందించారు. కొంత సాయం అందిస్తున్నట్లు చెప్పారు. తనలాగే సినిమా ఇండస్ట్రీ కూడా స్పందించాలని కోరాడు. దీంతో చాలామంది సినీ ప్రముఖులు, టీవీ రంగ ప్రముఖులు అతడికి సాయం చేస్తున్నారు. స్టార్స్, డైరెక్టర్స్, మ్యూజిక్ డైరెక్టర్స్, పొలిటీషియన్స్.. ఇలా పలువురు సాయం అందిస్తున్నారు. బాలీవుడ్ సూపర్ స్టార్స్ సల్మాన్ ఖాన్, అజయ్ దేవగణ్, వరుణ్ ధావన్, అనీస్ బజ్మీ, గుర్మీత్ చౌదరి, డేవిడ్ ధావన్, రతన్ నైన్, కమల్ ఆర్ ఖాన్, నవాజుద్దీన్ సిద్ధిఖీ సహా పలువురు ప్రముఖులు తలా కొంత సాయం చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే జెమ్ ట్యూన్స్ సంస్థ అధినేత, రావ్ ఇంద్రజీత్ సింగ్ యాదవ్.. తన సంస్థ తరఫున రూ.1.1 కోట్లు సాయం చేస్తానని ప్రకటించారు. అలాగే రాజకీయ నాయకుడు తేజ్ ప్రతాప్ యాదవ్ రూ.11 లక్షలు ప్రకటించారు. రాజ్‌పాల్ యాదవ్ దర్శకుడిగా 2012లో రూపొందించిన అటా పటా లాపటా అనే సినిమాకు నష్టాలు రావడంతో అప్పుల్లో కూరుకుపోయారు. వాటికి సంబంధించి చెల్లించాల్సిన రూ.9 కోట్ల చెక్ బౌన్స్ కేసులో అతడు కోర్టులో లొంగిపోయాడు. అతడు డబ్బు చెల్లించేందుకు ఇంకాస్త సమయం కోరినప్పటికీ ఢిల్లీ కోర్టు నిరాకరించింది. దీంతో తన దగ్గర డబ్బులు లేవని చెబుతూ రాజ్‌పాల్ యాదవ్ కోర్టులో లొంగిపోయాడు. మరోవైపు అతడికి రెండు రోజుల్లో బెయిల్ వచ్చే అవకాశం ఉందని అతడి మేనేజర్, లాయర్ తెలిపారు.


# రెండోసారి తల్లి కాబోతున్న సోనమ్ కపూర్..



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనమ్ కపూర్ రెండోసారి తల్లి కాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ముంబైలో సీమంతం వేడుకను ఘనంగా జరుపుకుంది ఈ భామ. ఫిబ్రవరి 8, 2026న ముంబైలోని అనిల్ కపూర్ నివాసంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకలో సోనమ్ లెమన్ గ్రీన్ కలర్ లెహంగాలో మెరిసిపోయారు. ఈ కార్యక్రమంలో కరీనా కపూర్ ఖాన్, భూమి పెడ్నేకర్, షబానా అజ్మీ, అనుపమ్ ఖేర్ వంటి సినీ ప్రముఖులు సందడి చేశారు. అయితే ఈ సీమంతం గురించి ఆసక్తికర విషయాలను చెబుతూ.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పోస్ట్ పెట్టింది సోనమ్ కపూర్. 'సనాతన ధర్మంలోని పదహారు పవిత్ర సంస్కారాలలో (సీమంతోన్నయనం) ాావవఝిఖశీఅఖుఝఅ వేడుక మూడవది. దీనిని సాధారణంగా 'జుట్టు పాపిడి తీసే వేడుక' అని పిలుస్తారు. ఇది కాబోయే తల్లిని, ఆమె గర్భంలో పెరుగుతున్న జీవాన్ని గౌరవించే అద్భుతమైన క్రతువు. భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో దీనిని గోద్ భరాయ్, శ్రీమంత్, దోహాలే జేవన్, షాద్, సీమంతం, వలైకాప్పు, సీమంత, పులిక్కుడి మరియు సధభక్షణ్ వంటి రకరకాల పేర్లతో పిలుస్తారు. పేర్లు మారవచ్చు కానీ, ఆశీర్వాదం మాత్రం ఒక్కటే. అది ప్రేమ, రక్షణ మరియు కొత్త ప్రాణానికి లభించే వేడుక. ఈ పురాతన ఆచారం నాకెంతో అర్థవంతంగా అనిపించింది, ఎందుకంటే నా ప్రాణ స్నేహితులందరూ నా కోసం ఇక్కడికి వచ్చారు. నా కుటుంబ సభ్యులందరూ కూడా తోడుగా నిలిచారు. అందరూ కలిసి నన్ను ఎంతో ఆప్యాయంగా చూసుకున్నట్లు అనిపించింది. ఈ వేడుకను ఎంతో అద్భుతంగా నిర్వహించి, నేను ఎంతో ప్రేమించబడుతున్నాను అనే అనుభూతిని కలిగించిన మా అమ్మకు, అత్తగారికి మరియు నా సోదరికి పేరుపేరునా ధన్యవాదాలు. ఈ జ్ఞాపకాలను నేను ఎప్పటికీ మర్చిపోలేను'. అంటూ సోనమ్ రాసుకొచ్చింది.

# వెంకీ మామ కోసం స్క్రిప్ట్ వర్క్‌లో అనుదీప్

## - గ్రీన్ సిగ్నల్ ఇచ్చేనా?



టాలీవుడ్‌లో కామెడీకి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే విక్టరీ వెంకటేష్, తనదైన మార్క్ 'సెటైరికల్' హాస్యంతో ప్రేక్షకులను అలరించే దర్శకుడు కేవీ అనుదీప్ చేతులు కలపబోతున్నట్లు తెలుస్తోంది. 'జాతిరత్నాలు' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన అనుదీప్, ప్రస్తుతం మాస్ కా దాస్ విశ్వక్ సేన్‌తో తెరకెక్కించిన 'ఫంకీ' సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్నాడు. ఈ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా అనుదీప్ తన తదుపరి చిత్రాలపై స్పందిస్తూ, వెంకటేష్ గారి కోసం ఒక ప్రత్యేకమైన కథను సిద్ధం చేస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. గతంలో అనుదీప్ వెంకటేష్‌కు ఒక కథను వినిపించగా, ఆయన సానుకూలంగా స్పందించారని సమాచారం. అయితే, స్క్రిప్ట్‌లో మరిన్ని మెరుగులు దిద్దాలని వెంకీ సూచించడంతో, ప్రస్తుతం అనుదీప్ ఆ పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది. ఫైనల్ వెర్షన్ సిద్ధమయ్యాక మరోసారి నేరేషన్ ఇచ్చి గ్రీన్ సిగ్నల్ తీసుకోవాలని దర్శకుడు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. వెంకీమామ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' అనే ఫ్యామిలీ క్రైమ్ కామెడీ సినిమాలో నటిస్తున్నారు. దీనితో పాటు అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో ఒక ఎంటర్‌టైనర్, అలాగే 'దృశ్యం 3' కూడా లైన్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయిన తర్వాతే అనుదీప్ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది.

# నేషనల్ కరాటేలో బంగారు పతకాలు సాధించిన నాచారం ఛాంపియన్స్






నాచారం(ప్రశ్న న్యూస్) జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు గుంటూరు జిల్లా, మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి, ఐ ర్ ఏ కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు దేశంలోని నలుమూలల నుండి క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర, ఉప్పల్ నియోజకవర్గ, నాచారం డివిజన్ నుండి బి.రాము స్పారింగ్ విభాగంలో బి.ఆదర్శిని కటాస్ లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి బంగారు పథకం సాధించారు. వీరిరువురిని తెలంగాణ చీఫ్ ఎగ్జామినర్ రాపోల్ సుదర్శన్, మాస్టర్. రాజశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందిస్తూ వారికి బంగారు పథకాలు అందజేశారు. ఈ సందర్భంగా రాపోల్ సుదర్శన్ మాట్లాడుతూ బి.రాము గౌడ్ ఆదర్శిని నేషనల్ కరాటేలో బంగారు పథకాలు సాధించి తెలంగాణ రాష్ట్ర కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడమే కాకుండా నేటితరం యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. వీరు భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించి ఒలంపిక్స్ స్థాయికి ఎదగాలని దీవించారు.

# జన్మదినాన్ని హరిత వేడుకగా మార్చిన చిన్నారి సమీక్ష

**- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**- తడగొండ మాజీ సర్పంచ్ : చిందం రమేష్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, తడగొండ గ్రామంలో పర్యావరణంపై అవగాహన పెంచే గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమానికి చిన్నారి సమీక్ష తన పుట్టినరోజు సందర్భంగా మద్దతు తెలిపింది. సావనపల్లి మహేష్--మనీషా దంపతుల కుమార్తె సమీక్ష కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం వారి ఇంటి ప్రాంగణంలో మొక్క నాటి ప్రత్యేకంగా జన్మదినాన్ని జరుపుకుంది. మొక్కలు నాటడం తనకు ఇష్టమని, పుట్టినరోజు రోజున మొక్క నాటడం ద్వారా ప్రకృతికి మేలు చేయడం ఆనందంగా ఉందని సమీక్ష పేర్కొంది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చిందం రమేష్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డిజిటల్ దిశగా వేములవాడ రాజన్న క్షేత్రం

**- వాట్సాప్ చాట్‌బోట్‌తో భక్తుల సేవలు ప్రారంభం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం భక్తుల సౌకర్యార్థం డిజిటల్ దిశగా మరో ముందడుగు వేసింది. ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సమాచారాన్ని తక్షణం అందించేందుకు దేవస్థానం వాట్సాప్ చాట్‌బోట్ సేవలను ప్రారంభించింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ,కమిషనర్ సూచనల మేరకు ఆలయ ఈఓ రమాదేవి ఈ సేవలను బుధవారం అధికారికంగా ప్రారంభించారు. "సర్వీసెస్ ఇన్ జస్ట్ ఎ ఫ్యూ క్లిక్" అనే నినాదంతో ప్రవేశపెట్టిన ఈ విధానం ద్వారా భక్తులు ఆలయ సేవల వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం కలిగింది. భక్తులు పోస్టర్‌లో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లేదా 8736936969 నంబర్‌కు వాట్సాప్‌లో "హాయ్" అని మెసేజ్ పంపడం ద్వారా చాట్‌బోట్ సేవలను వినియోగించుకోవచ్చు. వెంటనే చాట్‌బోట్ స్పందించి అవసరమైన వివరాలను అందిస్తుంది. ఈ సేవల ద్వారా దర్శనం, సేవల సమయాలు, దర్శన టికెట్ కౌంటర్లు, ప్రసాదం కౌంటర్, అన్నప్రసాదం, రవాణా సదుపాయాలు, ఆసుపత్రి, దివ్యాంగులకు సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు, కళ్యాణకట్ట, సమాచారం కేంద్రం, పోలీస్ స్టేషన్ తదితర అంశాలపై సమాచారం లభిస్తుంది. భక్తులు తమకు అవసరమైన సేవకు సంబంధించిన సంఖ్యను నమోదు చేసి సమాచారం పొందవచ్చు. భక్తులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ఈ డిజిటల్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇంచార్జి స్థానాచారి నమిలికొండ ఉమేష్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్ శర్మ, ఈఈ రాజేష్, ఏఈవో బ్రహ్మన్న శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మతో పాటు ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. సాంకేతిక భాగస్వామిగా ఆత్రేయ ఇన్ఫోటెక్ సంస్థ సేవలను అందించింది.

# అన్ని శాఖల సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలి

**- ఇంచార్జి కలెక్టర్ : గరిమ అగ్రవాల్**

**- జిల్లా ఎస్పీ : మహేష్ బి. గితే**

**- భక్తుల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం - పరిశీలన**



వేములవాడ (ప్రశ్న న్యూస్) మహాశివరాత్రి జాతరను దృష్టిలో ఉంచుకొని వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జాతర రోజుల్లో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే, వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి,అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కలిసి క్యూలైన్ల నిర్వహణ, భక్తుల ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు, భద్రతా చర్యలను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వీఐపీ దర్శనాల కోసం ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లను కూడా పరిశీలించి అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ రాధాబాయి, ఈఈ రాజేష్, ఆర్అండ్‌బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, టీపీఓ అన్సార్‌తో పాటు ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

# బోరు మరమ్మతులతో తాగునీటి సమస్యకు ఊరట

**- సర్పంచ్ భాస్కర్ నేతృత్వంలో బోరు మరమ్మతులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలో 10వ వార్డులోని బోరు మరమ్మతులను గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ పర్యవేక్షణలో బుధవారం పూర్తి చేశారు. కొంతకాలంగా పనికి రాకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు తీసుకున్నారు. మరమ్మతుల అనంతరం బోరును మళ్లీ వినియోగంలోకి తీసుకురావడంతో ఆ ప్రాంత ప్రజలకు నీటి సరఫరా సులభమైంది. గ్రామంలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు కొనసాగిస్తామని సర్పంచ్ అనుముల భాస్కర్ తెలిపారు. మౌళిక సదుపాయాల మెరుగుదలపై గ్రామపంచాయతీ దృష్టి పెట్టడాన్ని గ్రామస్థులు స్వాగతించారు.

# పనికిరాని అక్రిడేషన్ కార్డులు మాకెందుకు ప్రయోజనాలు తక్కువ.. బిల్డప్ ఎక్కువ

**భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే అక్రిడేషన్ కార్డులు జర్నలిస్టులకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయని దేనికి పనికిరాని అక్రిడేషన్ కార్డులు మాకెందుకు అని సత్యం గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రిడేషన్ కార్డులు ఉన్నప్పటికీ కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సరైన గుర్తింపు లభించడం లేదని, ఈ అక్రిడేషన్ కార్డుల ద్వారా లభించాల్సిన సౌకర్యాలు ఆరోగ్య పథకాలు, బీమా సదుపాయాలు పూర్తిస్థాయిలో ఎక్కడ అమలు కావడంలేదని అన్నారు. కార్డు ఇవ్వడంలో కఠినమైన అర్హతలు, పత్రాల సమర్పణ అడుగుతున్నప్పటికీ దానిద్వారా ప్రయోజనం మాత్రం కనిపించడం లేదేమని ప్రశ్నించారు. జర్నలిస్టుల భద్రత, గౌరవం కోసం అక్రిడేషన్ కార్డులు ఉండాలి కానీ అది కేవలం గుర్తింపు కార్డు గానే ఉందని వీటివల్ల గత కెసిఆర్ ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఒరిగేదేమీ లేదని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ప్రత్యేకంగా వచ్చేదేమీ లేదన్నారు. వీటి ఆధారంగా ఇచ్చిన హెల్త్ కార్డులు ఒక వెల్నెస్ సెంటర్లో తప్ప ఇంకెక్కడ ఆసుపత్రులలో అసలు పనిచేయడం లేదని పైగా ఈ కార్డులు ఇవ్వటానికి ఎన్నో షరతులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. జర్నలిస్టులు, మేధావులు మౌనంగా ఉంటే పరిస్థితి ఇలాగే ఉంటుందని భవిష్యత్తులో ప్రభుత్వం స్థలాలు వచ్చేనా డబుల్ బెడ్రూంలు ఇచ్చేనా ఇతర ప్రయోజనాలు కలిగేనా. అక్రిడేషన్ కార్డులు సక్రమంగా జారీ చేసి వాటి వల్ల వచ్చే ప్రయోజనాలను కల్పించాలని భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్ డిమాండ్ చేశారు.

# చిన్నలూరు గ్రామంలో సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న : మాజీమంత్రి ఆర్కే రోజా



నగరి(ప్రశ్న న్యూస్)రూరల్ మండలం నంబాకం పంచాయతీ చిన్నలూరు గ్రామంలో వైఎస్ఆర్సిపి నాయకురాలు పుష్ప కోడలు, శరణ్ రాజ్ భార్య శరణ్య సీమంతం కార్యక్రమం జరిగిన సందర్భంగా మాజీ మంత్రి ఆర్.కే. రోజా వారి నివాసానికి వెళ్లి శరణ్యకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు మాజీ మంత్రి కి సాదరంగా స్వాగతం పలికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళలకు ఏపీ ఆర్టీసీ శివరాత్రి కానుక.. స్పెషల్ బస్సుల్లోనూ ఫ్రీ జర్నీ

**మహాశివరాత్రికి ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు**

**స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం**

**కోటప్పకొండకు 618, శ్రీశైలానికి పలు డిపోల నుంచి బస్సులు**

**భక్తుల సౌకర్యార్థం రెండు వేల మంది సిబ్బందితో ఏర్పాట్లు**

**ప్రత్యేక సర్వీసుల ఛార్జీల వివరాలు ప్రకటించిన అధికారులు**




పల్నాడు(ప్రశ్న న్యూస్)జిల్లాలోని కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం మొత్తం 618 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి అదనంగా 70 బస్సులను నడుపుతున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దాదాపు రెండు వేల మంది సిబ్బందిని విధుల్లో నియమించారు. నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, అద్దంకి, చీరాల డిపోల నుంచి ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ప్రయాణికుల సౌకర్యార్థం పెట్లూరివారిపాలెం వద్ద ప్రత్యేకంగా ఆర్టీసీ క్యాంపు కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు.

# శ్రీశైలం చేరుతున్న భక్తులకు కల్పించిన సౌకర్యాలపై సమగ్ర పర్యవేక్షణ

**కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్)మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షోరాణ్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చొని క్యూలైన్లు, ట్రాఫిక్ నిర్వహణ, దర్శనాల ఏర్పాట్లు, అన్నదాన భోజనాల వసతులు, పార్కింగ్ ప్రదేశాలు, నడకదారి భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక విశ్రాంతి కేంద్రాలు, తాగునీరు, వైద్య శిబిరాలు తదితర సదుపాయాలను సిసి కెమెరాల ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముఖ్యంగా తొక్కిసలాటకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో దర్శనాలు జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నడకదారిలో వచ్చే భక్తులకు ప్రత్యేక వైద్య బృందాలు, మొబైల్ అంబులెన్సులు, తాగునీటి సదుపాయాలు, శుచితా ఏర్పాట్లు, భద్రతా చర్యలు పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని వాహనాలను నియంత్రిత పార్కింగ్ ప్రదేశాలకు మళ్లిస్తున్నామని, భక్తులు పోలీసు సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. క్యూలైన్లలో తొందరపడకుండా, చిన్నపిల్లలు వృద్ధులను ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఎక్కువసేపు ఎండలో నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తగినంత తాగునీరు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన పక్షంలో వెంటనే భద్రతా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వ్యవస్థలను వినియోగించుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణ స్పందన కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి, భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనాన్ని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు.

# మా కొడుకును ఎందుకు కొట్టావు టీచర్

**- 3 ఏళ్ల బాలుడిని కన్ను పోయేలా కొట్టిన అంగన్వాడీ టీచర్**

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు**



**ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్)** అంగన్వాడీ టీచర్ల ఆగడాలు, నిర్లక్ష్యం, అవినీతికి సంబంధించిన ఫిర్యాదులు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తుంటాయి. పోషకాహార పంపిణీలో అక్రమాలు, కేంద్రాలను సకాలంలో తెరవకపోవడం, పిల్లల పట్ల అశ్రద్ధ, రికార్డుల నిర్వహణలో అవకతవకలు వంటి సమస్యలు కొన్ని ప్రాంతాల్లో నివేదించ బడుతుంటాయి. ఇటువంటి సంఘటనలు 6 సంవత్సరాల లోపు పిల్లలకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్యను అందించే అంగన్‌వాడీల ముఖ్య ఉద్దేశానికి ఆటంకం కలిగిస్తాయి. ఇంతకుమించి తారస్థాయి కర్కశత్వం కాదు కాదు. రాక్షసత్వం వెలుగులోకి వచ్చింది. వెంకటాపూర్ గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొంపెల్లి లక్ష్మి విజయ్ కుమార్ కొడుకు విధ్వాన్ష్‌ను అంగన్వాడి పాఠశాలలో టీచర్ సల్వాజి రాణి 3 ఏళ్ల బాలుడిని చితక బాదడంతో కన్నుకు తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తమ కొడుకుని అకారణంగా ఇష్టం వచ్చినట్లు కొట్టిన అంగన్వాడీ టీచర్ సల్వాజి రాణిపై చర్యలు తీసుకోవాలని చిన్నారి తల్లిదండ్రులు కోరారు.

### సిడిపిఓ నేతృత్వంలో అంగన్వాడి సూపర్వైజర్ లు విచారణ, 15 రోజుల సస్పెండ్

వెంకటాపూర్ గ్రామానికి చెందిన విధ్వాన్ష్ అనే బాలుడిని చితకబాదిన సంఘటనలో సల్వాజి రాణి అనే అంగన్వాడి టీచర్ ను 15 రోజులపాటు సస్పెండ్ చేస్తున్నట్లు డి డబ్ల్యు ఓ లక్ష్మీరాజం తెలిపారు. సిడిపిఓ నేతృత్వంలో అంగన్వాడి సూపర్వైజర్ లు విచారణ జరిపి ఇచ్చిన నివేదిక ఆధారంగా రాణి పై తదుపరి చర్యలు ఉంటాయని తెలియజేశారు.

### అంగన్వాడీ టీచర్ పై కేసు నమోదు

వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొంపల్లి లక్ష్మి విజయ్ కుమార్ తన కొడుకు 3 ఏళ్ల కొంపెల్లి విధ్వాన్ష్ ను ప్రతిరోజు గ్రామంలో అంగన్వాడి సెంటర్ కి పంపిస్తుందని, రోజు మాదిరిగానే మంగళవారం రోజున ఉదయం తన కొడుకుని అంగన్వాడి సెంటర్ కు పంపగా, అంగన్వాడి సెంటర్లో పనిచేస్తున్న టీచర్ అయిన సల్వాని రాణి, ఇష్టం వచ్చినట్లు కొట్టినదని, కన్నుకు తీవ్ర గాయమై, ఒంటిపై తీవ్రంగా దెబ్బలు కొట్టి ఉండడంతో ఫిర్యాదు చేయడంతో ఎల్లారెడ్డిపేట ఎస్సై కే రాహుల్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# బుర్జు గల్లిలో మున్సిపల్ నిబంధనలకు తూట్లు

**- అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం**

**- అధికారుల మౌనం వెనుక లంచాలే కారణమా.?**

**- ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోరు**



**అంబర్ పేట (ప్రశ్న న్యూస్)** అంబర్ పేట సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా బురుజు గల్లి ప్రాంతం అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎలాంటి భవన అనుమతులు లేకుండా, ప్లాన్ అప్రూవల్, సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు, టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు అగ్రహారం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణం కళ్ల ముందు కనిపిస్తున్నా, నోటీసులు ఇవ్వకుండా, పనులు ఆపకుండా అధికారులు మౌనం వహించడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### లంచాలు ఇచ్చి అక్రమ నిర్మాణాలు చేసుకోవచ్చా.?

అక్రమ నిర్మాణాల వెనుక మున్సిపల్ అధికారులకు భారీగా లంచాలు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. డబ్బు ఇస్తే చాలు, నిబంధనలు అక్కర్లేదు అన్నట్లు వ్యవహారం నడుస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారులు, న్యాక్ ఇంజనీర్లు, చైన్ మెన్ లు కలిసి అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారా.? అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. బురుజు గల్లీలో పక్కింటి నెంబర్ 2-2-474 పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంటే అధికారులు లంచాలు తీసుకుని జిహెచ్ఎంసి ఆదాయానికి గండికోటి నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### మున్సిపల్ నిబంధనలు కాగితాలకే పరిమితమా.?

సాధారణ పౌరుడు ఇంటి గోడ కట్టాలంటే నోటీసులు, కూల్చివేతలు చేసే అధికారులు, సిబ్బంది. డబ్బు, రాజకీయ పలుకుబడి చూపించి

అక్రమ నిర్మాణదారులు మాత్రం అనుమతులు లేకుండానే భారీ భవనాలు కడుతుంటే అధికారులు ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారు. ఎలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు జరుగుతుంటే ఈ అక్రమ నిర్మాణాల వల్ల రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి, డ్రైనేజ్ సమస్యలు పెరుగుతున్నాయి,



భవిష్యత్తులో ప్రాణహానికీ ప్రమాదం జరుగుతే కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది.

### అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

అంబర్పేట సర్కిల్ పరిధిలో

అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు లేవు.?

ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం వెనుక ఎవరి ఆదేశాలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలకు పూర్తిగా సహకరిస్తూ భారీగా లంచాలు తీసుకున్న అధికారులపై విచారణ ఎప్పుడు.?

ఇప్పటికైనా జిహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి, బురుజు గల్లి అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే అంబర్పేట సర్కిల్ మొత్తం అక్రమ నిర్మాణాల అరణ్యంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

**- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి - ప్రపంచంలోనే మేటి నగరాలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి ప్రణాళికలు**

**- 2047 కల్లా త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యం - మధిర లో ఓటు వేసిన అనంతరం మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**మధిర (ప్రశ్న న్యూస్)**రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజాస్వామ్య పండుగ లో విజ్ఞులైన తెలంగాణ ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర పట్టణంలోని తొమ్మిదవ వార్డులో తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రపంచీకరణ తరువాత గ్రామాలు పట్టణాలుగా రూపాంతరం చెందుతున్నాయి ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతుందని తెలిపారు. 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిదేందుకు ఇ-బీతీవ ప్యూర్, రేర్ కోర్ అర్బన్, ఫెరి అర్బన్, రూరల్ అగ్రికల్చర్ ఎకానమీ విభాగాలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోతున్నామని తెలిపారు. మిశ్రమలు విద్య వైద్యం మౌలిక వసతుల మేలు కలయిక ఈ ప్రణాళికలో ఉంటుందని తెలిపారు. ఎయిర్ ఇండెక్స్ సూచిక 250 దాటుతుంది ఢిల్లీ కలకత్తా వంటి నగరాల్లో నివసించడమే కష్టం అవుతుంది ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గాలి నాణ్యతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్లలో ఆదాయం కోల్పోతున్నప్పటికీ బ్యాటరీ వివాహనాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పట్టణాల్లో మురుగునీటిని శుభ్రం చేసేందుకు పెద్ద సంఖ్యలో ఎస్టిపిలను నిర్మాణం చేస్తున్నామన్నారు. చెరువుల ను ఆక్రమణదారుల నుంచి విముక్తి కల్పించి పార్కులు, చెరువులను టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఉత్పత్తికి ప్రధానమైన విద్యుత్తు సరఫరాలో రెప్పపాటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, పేద కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు ?200 యూనిట్ల వరకు విద్యుత్తు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. మా ప్రభుత్వం వచ్చాక 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, గ్రామీణ ప్రాంతాల యువత పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్లకుండా నియోజకవర్గ కేంద్రాల్లోని ఆన్లైన్లో ఉచితంగా శిక్షణ పొందేందుకు అంబేద్కర్ నాలెడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల్లో దేశంలోని ప్రముఖ లెక్చరర్ల ద్వారా శిక్షణ ఇప్పిస్తామని అన్నారు. స్కిల్స్ ఉంటేనే ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లభిస్తాయి అందుకే నియోజకవర్గ కేంద్రాల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు నెలకొల్పామని తెలిపారు. పేద బిడ్డలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ లో విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని ఒక్కో పాఠశాలను 25 ఎకరాల్లో 200 కోట్లతో అన్ని నియోజకవర్గాల్లో నిర్మిస్తున్నామని అన్నారు . నిన్న లేని పేదలకు 5 లక్షల రూపాయలతో ఇంద్ర మా ఇల్లు నిర్మిస్తున్నామని తెలిపారు.



## హుస్నాబాద్ లో కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి పొన్నం



**హుస్నాబాద్ ( ప్రశ్న న్యూస్)** హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థ లో ఓటు అనేది ఆయుధం. ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం ఓటర్లు ఓటు వేస్తున్నారు అర్బన్ ప్రాంతాల్లో అవగాహన తక్కువ ఉంది. 116 మున్సిపాలిటీ లు ,7 కార్పొరేషన్ లలో ప్రతి అర్బన్ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్న. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులను ఏ విధంగా ఎన్నుకుంటున్నారో అర్బన్ ప్రాంతాల అభివృద్ధికి పట్టణ ఓటర్లు తమ విచక్షణ తో ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడి ప్రజా ప్రతినిధి నీ ఎక్కుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న.ఓటు వేయకుంటే గ్రామీణ ప్రాంతాల్లో జీవించి ఉన్నట్లు కాదని నానుడి చెప్తారు. అర్బన్ లో అనేక పనులు ఉన్నప్పటికీ వెసులుబాటు చేసుకొని తమ ఓటు వినియోగించుకోవాలి అర్బన్ ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకోండి ఇది ప్రజాస్వామ్యానికి నిదర్శనమని అన్నారు.

# ఓటు వేసిన ప్రముఖులు





**హైదరాబాద్,( ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని 116 మున్సిపాలిటీలలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కొనసాగుతోంది. పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. కాసేపట్లో ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుని ఢిల్లీకి వెళ్లనున్నారు..ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కరీంనగర్ జ్యోతి నగర్‌లోని ఎస్సార్ హై స్కూల్ కేంద్రంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది.

## రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటాం

**- రేవంత్ రెడ్డి సర్కార్ కు బ్రహ్మరథం.**

**- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు.**



**కమాన్ పూర్ ( ప్రశ్న న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం ఉదయం కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రామగుండం, కరీంనగర్, కార్పొరేషన్లను పూర్తిస్థాయిలో కాంగ్రెస్ కార్పొరేటర్ గెల్పొంది ఆయా రెండు పీఠాలను హస్తగతం చేసుకుంటామని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మంథని పెద్దపల్లి అలాగే కరీంనగర్ జిల్లాలోని మొత్తం మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది అని అన్నారు. ముఖ్యంగా రేవంత్ రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓటు వేశారని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ హవా కొనసాగుతోందని పేర్కొన్నారు. అన్ని స్థానాల్లో స్థానాల్లో భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన లో ప్రజలు ఆనందంగా ఉన్నారని అలాగే మా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం అయిందని అన్నారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. నేడు తెలంగాణలోని ప్రతి ఒక్కరి కళ్ళలో కాంగ్రెస్ పాలనలో ఆనందం వెల్లివిరుస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, పేరా పల్లి సర్పంచ్ బొంగుని సదయ్య గౌడ్, గుండారం ఉపసర్పంచ్ అంబిరి రాజేందర్, వార్డు సభ్యులు పిడుగు సది, గరిగంటి కృష్ణ,బొడ్డు రవి, పిడుగు కవిత, రాచకొండ రజిత, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు , ఆడువాలా చంద్రయ్య తోపాటు నాయకులు పిడుగు శంకర్, మతిన్ ఖాన్ ఇక్బాల్, లల్లు, వడ్లకొండ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588